

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 23-08-2025 | సంపుటి - 24 | సంచిక - 106 | రూ : 4 | పేజీలు: 8



3లో

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా మళ్లీ కూనంనేని

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు మరోసారి ఎన్నికయ్యారు. నగరం లోని గాజులరామారంలో జరిగిన సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల్లో ఆయన పేరును పార్టీ నేత వెంకట్రెడ్డి ప్రతిపాదించగా, మరో నేత శంకర్ బలపరిచారు. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సాంబశివరావు ప్రస్తుతం కొత్తగూడెం ఎమ్మెల్యే గా ఉన్నారు.

## ఈ నెల 25న తెలంగాణ మంత్రివర్గ సమావేశం..

- స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం!!
- పంచాయతీ ఎన్నికల కోసం సెప్టెంబర్ 30 గడువు విధించిన హైకోర్టు
- ఎన్నికల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం
- రిజర్వేషన్లు రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం ఇచ్చే అవకాశం



2లో

## పార్టీ బలోపేతంపై చంద్రబాబు ఫోకస్...

## 25 పార్లమెంటు నియోజకవర్గాలకు పరిశీలకులు వీరే!



- టీడీపీ పార్లమెంటరీ కమిటీల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభం
- 25 నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించిన అధిష్టానం
- పలువురు సీనియర్ నేతలకు కీలక బాధ్యతల అప్పగింత
- మూడు రోజుల పాటు జరగనున్న సర్వసభ్య సమావేశాలు

2లో

## ఏపీలో 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

### మొదట ఈ జిల్లాలకే పరిమితం



2లో

## అవినీతిపై సరికొత్త అస్త్రం.. జైలు నుంచి ఫైళ్లపై

## సంతకాలు చేసే రోజులు పోయాయి

- అవినీతిపై కొత్తగా తెచ్చిన మూడు బిల్లులను సమర్థించిన ప్రధాని మోదీ
- తీవ్ర ఆరోపణలతో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ తప్పనిసరి అని వెల్లడి
- బెయిల్ రాకపోతే 31వ రోజు పీఎం, సీఎం పదవికి రాజీనామా చేయాలి
- జైలు నుంచి ఫైళ్లపై సంతకాలు చేసే రోజులు పోయాయంటూ పరోక్ష విమర్శలు
- కొత్త చట్టాలంటే ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని ఎద్దేవా
- కాంగ్రెస్, ఆర్జేడీల అవినీతిపై బీహార్ సభలో తీవ్ర స్థాయిలో ధ్వజం



ఢిల్లీ : అవినీతిపై తమ ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించబోతోందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలతో అరెస్టయిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు 30 రోజుల్లోగా బెయిల్ పొం దలేకపోతే, 31వ రోజున తమ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన మూడు కొత్త బిల్లులను ఆయన గట్టిగా సమర్థించారు. శుక్రవారం బీహార్‌లోని గయలో జరిగిన

తరువాయి 2లో



## తుపాకులు వదిలి డ్రగ్స్ దందా...

- ఇండియాలో దావూద్ ఇబ్రహీం కొత్త వ్యాపారం బట్టబయలు
- భోపాల్ శివారులోని జగదీశ్‌పుర గ్రామంలో భారీ డ్రగ్స్ ఫ్యాక్టరీ గుర్తింపు
- రూ.92 కోట్ల విలువైన మెఫిడ్రోన్ స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ అధికారులు
- తుపాకుల దందా నుంచి సింథటిక్ డ్రగ్స్ తయారీకి మారిన డి-కంపెనీ

2లో

## నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ..

- ఏపీకి రూ.5,000 కోట్లు కావాలని విజ్ఞప్తి



2లో



### కేసీఆర్ పాలనను, ఇప్పటి పాలనను పోల్చుతూ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

- ఎరువుల కొరతపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించిన కేటీఆర్

2లో

# అవినీతిపై సరికొత్త అస్త్రం.. జైలు నుంచి ఫైళ్లపై సంతకాలు చేసే రోజులు పోయాయి: ప్రధాని

**ఢిల్లీ, ఆగష్టు 22 :** అవినీతిపై తమ ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించబోతోందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలతో అరెస్టయిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు 30 రోజుల్లోగా బెయిల్ పొందలేకపోతే, 31వ రోజున తమ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన మూడు కొత్త బిల్లులను ఆయన గట్టిగా సమర్థించారు. శుక్రవారం బీహార్‌లోని గయలో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కొత్త చట్టాలను చూసి ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయో ప్రజలందరికీ తెలుసని మోదీ చురకలంటించారు. ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ అవినీతి నిరోధక బిల్లుల పరిధిలోకి దేశ ప్రధాని కూడా వస్తారని ఆయన గుర్తుచేశారు. "ఈ చట్టం అమల్లోకి వస్తే, ఏ ముఖ్యమంత్రి, మంత్రి లేదా ప్రధానమంత్రి అయినా అరెస్ట్ అయిన 30 రోజుల్లోగా బెయిల్ తెచ్చుకోవాలి. లేదంటే వారు తమ పదవిని వదులుకోవాల్సి ఉంటుంది" అని ప్రధాని వివరించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం, ఒక చిన్న ప్రభుత్వ ఉద్యోగి 50 గంటల పాటు అదుపులో ఉంటే సస్పెండ్ అవుతాడని, కానీ ముఖ్యమంత్రులు, మంత్రులు మాత్రం జైల్లో ఉంటూ కూడా అధికార ప్రయోజనాలను అనుభవిస్తున్నారని మోదీ అన్నారు. ఇటీవల కాలంలో జైలు నుంచే ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం చూశామని, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. నాయకుల తీరు ఇలా ఉంటే అవినీతిపై పోరాటం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. స్వాతంత్ర్యం తర్వాత 60-65 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అవినీతి కేసులు లెక్కలేనన్ని ఉన్నాయని, కానీ తమ ప్రభుత్వానికి ఒక్క అవినీతి మరక కూడా అంటలేదని మోదీ అన్నారు. బీహార్‌లోని ఆర్జేడీ అవినీతి గురించి ప్రతి చిన్న పిల్లాడికి కూడా తెలుసని ఎద్దేవా చేశారు. అవినీతిపై పోరాటాన్ని చివరి వరకు తీసుకెళ్లాలంటే ఎవరినీ వదిలిపెట్టకూడదనేది తన గట్టి నమ్మకమని చెప్పారు. కాంగ్రెస్, ఆర్జేడీ ప్రభుత్వాలు ప్రజాధనం విలువను ఎన్నడూ గుర్తించలేదని, తమ ఖజానాలు నింపుకోవడానికే దాన్ని ఉపయోగించాయని ఆరోపించారు. అందుకే వారి హయాంలో ప్రాజెక్టులు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండేవని, ప్రాజెక్టు ఆలస్యమయ్యే కొద్దీ దాని నుంచి డబ్బులు దండుకునేవారని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు.

## కేసీఆర్‌తో పార్టీ నేతల భేటీ.. కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ

**గజ్వేల్ :** కాళేశ్వరం ఆనకట్టల్లో లోపాలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్.. పార్టీ నేతలతో సమావేశమయ్యారు. కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణను హైకోర్టు ఐదు వారాలకు వాయిదా వేసింది. దీంతో తదుపరి ఏం చేయాలన్న విషయమై కేసీఆర్ దృష్టి సారించారు. హైకోర్టులో విచారణ ముగిసిన అనంతరం హరీశ్‌రావు ఎర్రవెల్లి వెళ్లారు. కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, వినోద్ కుమార్, దామోదర్ రావు తదితరులతో పార్టీ అధినేత సమావేశమయ్యారు.

## కేసీఆర్ పాలనను, ఇప్పటి పాలనను పోల్చుతూ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** తెలంగాణలో నెలకొన్న ఎరువుల కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎంతో ముందుచూపుతో వ్యవహరించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారని, కానీ ప్రస్తుత పాలనలో అన్నదాతలు రోడ్డెక్కే దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా బస్తాల కోసం రైతులు వ్యవసాయ సహకార సంఘాల వద్ద బారులు తీరుతున్నారని, ధర్నాలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్కసారి కూడా రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కలేదని ఆయన గుర్తుచేశారు. ఇది కదా నాయకత్వం అంటే, ఇది కదా ముందుచూపు అంటే అంటూ కేసీఆర్ పాలనలో తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. కేసీఆర్ నాయకత్వ పటిమను, ఆయన ముందుచూపును కేటీఆర్ ఈ సందర్భంగా వివరించారు. "సీజన్‌కు ముందే వ్యవసాయ అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించి, కేంద్రానికి కచ్చితమైన లెక్కలతో వినతులు పంపేవారు. ఏపీలోని నౌకాశ్రయాలకు మన అధికారులను పంపి, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి 25 ప్రత్యేక గూడ్స్ రైళ్లను ఏర్పాటు చేయించేవారు. అంతేకాకుండా, పొరుగు రాష్ట్ర రవాణా మంత్రులతో నేరుగా సంప్రదించి సుమారు 4 వేల లారీలను సిద్ధం చేసి, పోర్టుల నుంచి నేరుగా మండలాలకు యూరియా చేరేలా పక్కా ప్రణాళికలు రచించేవారు" అని కేటీఆర్ తెలిపారు. "పరిపాలన చేతకాని అసమర్థులు రాష్ట్రాన్ని ఏలడం వల్లే రైతులకు ఈ కన్నీళ్లు మిగిలాయని" కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. "ఒకవైపు కేసీఆర్ వందేళ్ల విజన్‌తో పనిచేస్తే, మరోవైపు కొందరికి విమర్శలు చేయడం తప్ప పనులు చేయడం రాదని ప్రజలు గ్రహించారని" అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారి పతనం ప్రారంభమైందని ఆయన హెచ్చరించారు. "జై కిసాన్.. జై కేసీఆర్" నినాదంతో తన వ్యాఖ్యలను ముగించారు.

## నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ.. ఏపీకి రూ.5,000 కోట్లు కావాలని విజ్ఞప్తి

**ఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా నేడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అదనంగా రూ.5,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. ఈ మేరకు ఆయన ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రాల మూలధన పెట్టుబడుల కోసం కేంద్రం అందిస్తున్న ప్రత్యేక సహాయ పథకం (SASCI) కింద ఈ నిధులను కేటాయించాలని చంద్రబాబు తన వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ఇదే పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,010 కోట్లు మంజూరైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి ప్రారంభించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ఈ అదనపు నిధులు అత్యవసరమని ఆయన వివరించినట్లు తెలిసింది. ఈ ప్రత్యేక నిధులతో పాటు, రాష్ట్రంలో చేపట్టబోయే పలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని ముఖ్యమంత్రి అభ్యర్థించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర సహకారం ఎంతో కీలకమని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశంలో చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా పాల్గొన్నారు.

## తుపాకులు వదిలి డ్రగ్స్ దందా...

**భోపాల్ :** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ శివారులోని ఓ మారుమూల గ్రామంలో అండర్ గ్రౌండ్ డాన్ దావూద్ ఇబ్రహీం ముఠా నడుపుతున్నట్లు భావిస్తున్న భారీ డ్రగ్స్ ఫ్యాక్టరీని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఛేదించారు. ప్రశాంతంగా కనిపించే జగదీశ్‌పుర గ్రామంలోని ఓ ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న ఈ స్థావరంపై ఈ నెల 16న దాడి చేసి, సుమారు రూ. 92 కోట్ల విలువైన సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో అండర్‌వరల్డ్ కార్యకలాపాలు మధ్యప్రదేశ్‌కు ఎంతలా విస్తరించాయో వెలుగులోకి వచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ దాడిలో 61.20 కిలోల ద్రవరూప మెఫిడ్రోన్ (ఎండి డ్రగ్), దాని తయారీకి ఉపయోగించే 541 కిలోల రసాయనాలను సీజ్ చేశారు. ముంబై, గుజరాత్‌లలో పట్టు బిగించిన పోలీసులు, నిఘా వర్గాల నుంచి తప్పించుకోవడానికి దావూద్ ముఠా తమ కార్యకలాపాలను మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు విస్తరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. తుపాకులు, బెదిరింపుల నుంచి డికంపెనీ ఇప్పుడు అత్యంత లాభదాయకమైన సింథటిక్ డ్రగ్స్ వ్యాపారం వైపు మళ్లిందని నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ మొత్తం నెట్‌వర్క్‌ను దావూద్ ఇబ్రహీం ఆయన అనుచరులు సలీం డోలా ఇస్మాయిల్ ఉమైద్ ఉర్ రెహ్మాన్ నిర్వహిస్తున్నారు. పాకిస్థాన్, దుబాయ్ నుంచి హవాలా మార్గంలో వస్తున్న నిధులతో ఈ దందాను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముంబై, థానే ప్రాంతాల నుంచి రసాయనాలను మినీ ట్రక్కుల్లో భోపాల్‌కు తరలించి, ఇక్కడ డ్రగ్స్‌ను తయారుచేసి దేశవ్యాప్తంగా సరఫరా చేయాలనేది వారి ప్రణాళిక అని వెల్లడించారు. ఈ ఫ్యాక్టరీని గుజరాత్‌లో శిక్షణ పొందిన ఫైసల్ ఖురేషి అనే ఫార్మసీ డిప్లొమా హోల్డర్, అతడి సహచరుడు రజాక్ ఖాన్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఏడేళ్లుగా ఖాళీగా ఉన్న ఇంటికి, డీఆర్ఐ దాడులకు కేవలం రెండు రోజుల ముందు అంటే ఆగస్టు 14న గంటల వ్యవధిలోనే విద్యుత్ మీటర్ మంజూరు కావడంపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారుల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద డ్రగ్స్ ఫ్యాక్టరీని నడపడం అసాధ్యమని, ఈ కోణంలో కూడా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి సూరత్, ముంబై నగరాల్లో మరో ఐదుగురిని అరెస్టు చేయడంతో ఈ నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నట్లు స్పష్టమైంది.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘే అరెస్టు

**శ్రీలంక :** శ్రీలంక రాజకీయాల్లో శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశ మాజీ అధ్యక్షుడు, ఆరుసార్లు ప్రధానిగా పనిచేసిన రణిల్ విక్రమసింఘేను పోలీసులు అరెస్ట్ చేశారు. అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వ్యక్తిగత విదేశీ పర్యటన కోసం ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ఈ అరెస్ట్ జరిగింది. వివరాల్లోకి వెళితే, 2023 సెప్టెంబర్‌లో రణిల్ విక్రమసింఘే లండన్‌లో పర్యటించారు. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనప్పటికీ, దానికైన ఖర్చులను ప్రభుత్వ నిధుల నుంచి చెల్లించారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అప్పుడు తన భార్యతో కలిసి ఓ విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఆ విదేశీ పర్యటన అధికారికంగా చేపట్టింది కాదని ఆయన ఆ తర్వాత తెలిపారు. అయితే దానికి ప్రభుత్వ నిధులను వినియోగించారని ఆరోపణలు ఉన్నాయి. హవానాలో జీ77 సదస్సులో హాజరై తిరిగి వస్తూ లండన్‌కు వెళ్లినప్పుడు తన భార్య ఖర్చులను ఆమెనే భరించారని, ప్రభుత్వ నిధులు వినియోగించలేదని విక్రమ్‌సింఘే వాదిస్తున్నారు. కానీ ఈ పర్యటనలో ప్రభుత్వ సొమ్ము వాడారని, అంగరక్షకులకు కూడా చెల్లింపులు చేశారని విచారణ అధికారులు చెబుతున్నారు. ఈ కేసుకు సంబంధించి శ్రీలంక పోలీసుల నేర పరిశోధన విభాగం (సీఐడీ) అధికారులు శుక్రవారం ఉదయం ఆయన్ను విచారించారు. విచారణ ముగిసిన వెంటనే ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు ఓ ఉన్నతాధికారి మీడియాకు తెలిపారు. అరెస్ట్ చేసిన రణిల్ విక్రమసింఘేను కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. శ్రీలంక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు, ప్రజాగ్రహంతో నాటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స పదవి నుంచి వైదొలగడంతో 2022 జూలైలో జరిగిన పార్లమెంటరీ ఓటింగ్‌లో రణిల్ విక్రమసింఘే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇప్పుడు ఆయన అవినీతి ఆరోపణలపై అరెస్ట్ కావడం

## ఏపీలో ఈ నెల 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 25వ తేదీన తొలి విడతగా తొమ్మిది జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ వివరాలను తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ కార్యక్రమాన్ని మొదటి దశలో కొన్ని ఎంపిక చేసిన జిల్లాల్లో ప్రారంభించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ జాబితాలో ఉత్తరాంధ్రకు చెందిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఎన్టీఆర్, కృష్ణా, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కూడా స్మార్ట్ కార్డుల పంపిణీని చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో మిగిలిన జిల్లాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కొత్త స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

## ఈ నెల 25న తెలంగాణ మంత్రివర్గ సమావేశం..

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల 25న సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి హైకోర్టు విధించిన గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఈ మంత్రివర్గ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ శనివారం జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకుని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసే అవకాశం ఉంది.

## జీవీఎంసీ కౌన్సిల్‌లో గందరగోళం.. కార్పొరేటర్ల మధ్య తోపులాట

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని వైసీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య తోపులాట జరిగింది. స్టీల్ ప్లాంట్ ఇష్యూ పరిష్కారం అయ్యే వరకు కౌన్సిల్ అజెండాలోకి వెళ్లవద్దని వైసీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. సభ్యులు తీర్మానం ప్రతిపాదిస్తే ఆమోదిస్తామని మేయర్ తెలిపారు. అయితే నాలుగు అంశాలను ప్రతిపాదిస్తూ వైసీపీ తీర్మానం పెట్టింది.

## పార్టీ బలోపేతంపై చంద్రబాబు ఫోకస్... 25 పార్లమెంటు నియోజకవర్గాలకు పరిశీలకులు వీరే!

ఏపీ అధికార పక్షం టీడీపీ ఇప్పుడు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో పార్టీ కమిటీల ఏర్పాటును పర్యవేక్షించేందుకు పరిశీలకులను నియమిస్తూ కిలక నిర్ణయం తీసుకుంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఈ నియామకాలను ఖరారు చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ముగ్గురు సీనియర్ నేతలతో కూడిన బృందాన్ని పరిశీలకులుగా నియమించారు. అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, పత్తిపాటి పుల్లారావు వంటి ప్రముఖ నేతలకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ పరిశీలకులు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో సర్వసభ్య సమావేశాలు నిర్వహించి, పార్టీ కమిటీల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను స్వీకరించి, సమన్వయం చేస్తారు. ఈ సమావేశాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆగస్టు 24: అనకాపల్లి, నర్సాపురం, ఏలూరు, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గాల్లో సమావేశాలు జరుగుతాయి.

ఆగస్టు 25: అరకు, కాకినాడ, అమలాపురం, బాపట్ల, రాజంపేట, చిత్తూరు, కడప, హిందూపురం నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తారు.

ఆగస్టు 26: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, నెల్లూరు, తిరుపతి, నంద్యాల, కర్నూలు, అనంతపురం పార్లమెంటు స్థానాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈ నియామకాల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలకు, నాయకులకు మధ్య సమన్వయం పెంచి, పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా టీడీపీ అధిష్టానం ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. పార్లమెంట్ వారీగా సర్వసభ్య కమిటీ వివరాలు ఈ విధంగా ఉన్నాయి:

1. అరకు (ST) - బందెలం అశోక్, బడేటి రాధాకృష్ణ, కొండపల్లి శ్రీనివాస్
2. శ్రీకాకుళం - వంగలపూడి అనిత, నజీర్ అహ్మద్, కర్రోతు బంగార్రాజు
3. విజయనగరం మహ్మద్ అహ్మద్ షరీఫ్, పీజీవీఆర్ నాయుడు (గన్నా బాబు), వాసంసెట్టి సుభాష్
4. విశాఖపట్నం - నిమ్మల రామానాయుడు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కుడిపూడి సత్తిబాబు
5. అనకాపల్లి - ఏలూరి సాంబశివరావు, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, దేగల ప్రభాకర్
6. కాకినాడ - కింజరాపు అచ్చెన్నాయుడు, అరిమిల్లి రాధాకృష్ణ, ప్రణవ్ గోపాల్
7. అమలాపురం - కొల్లు రవీంద్ర, జి.వి. అంజనేయులు, గొట్టిముక్కల రఘురామరాజు
8. రాజమండ్రి - పత్తిపాటి పుల్లారావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కొలుసు పార్థసారధి
9. నర్సాపురం - పొంగూరు నారాయణ, నూకసాని బాలాజీ, అనిమిని రవినాయుడు
10. ఏలూరు - గొట్టిపాటి రవి, బుద్దా నాగ జగదీష్, ఎం.ఎస్. రాజు
11. మచిలీపట్నం - కాల్వ శ్రీనివాసులు, దామచర్ల సత్యనారాయణ, పీలా గోవింద సత్యనారాయణ
12. విజయవాడ - పయ్యావుల కేశవ్, బి.టి. నాయుడు, పొలం రెడ్డి దినేష్ రెడ్డి
13. గుంటూరు - ఎన్ఎమ్‌డీ ఫరూక్, మద్దిపాటి వెంకట్రాజు, కిమిడి నాగార్జున
14. నరసరావుపేట - జ్యోతుల నెహ్రూ, కొనకళ్ళ నారాయణ, మందలపు రవి
15. బాపట్ల - పంచుమర్తి అనురాధ, వీరంకి వెంకటగురుమూర్తి, మన్నే సుబ్బారెడ్డి
16. ఒంగోలు - గుమ్మిడి సంధ్యారాణి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కనపర్తి శ్రీనివాస్
17. నెల్లూరు - ఆనగాని సత్య ప్రసాద్, పులివర్తి వెంకట మణిప్రసాద్, దూండి రాకేష్
18. తిరుపతి - మంతెన రామరాజు, ఎస్. సవిత, బుచ్చి రామ్ ప్రసాద్
19. రాజంపేట - ఆనంరామనారాయణరెడ్డి, గన్ని వీరాంజనేయులు, వై. నాగేశ్వరరావు యాదవ్
20. చిత్తూరు - బి.సి. జనార్ధనరెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పిల్లి మణిక్యాలరావు
21. నంద్యాల - సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోవెలమూడి నాని, పూల నాగరాజు
22. కర్నూలు - నక్కా ఆనందబాబు, బి.కె. పార్థసారథి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
23. కడప - బీదా రవిచంద్ర, బి.వి. జయనాగేశ్వరరెడ్డి, నాదెండ్ల బ్రహ్మంచౌదరి

# ఘనంగా జరిగిన సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు

* **అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఉద్యమ స్ఫూర్తితో ముగిసిన మహాసభలు**
* **హాజరైన 727 మంది ప్రతినిధులు**

కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ (మేడ్చల్ జిల్లా, గాజుల రామారం) : సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (గాజుల రామారం) లో ఘనంగా జరిగాయి. కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్లో ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన మహాసభలు మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఉద్యమ స్ఫూర్తితో ముగిశాయి. 'ఎర్ర జెండా జిందాబాద్, ఉద్యమాలే మా ఊపిరి, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం, మార్క్సిజం, లెనినిజం వర్ధిల్లాలి' అని ప్రతినిధులు నినదిస్తూ పోరాట కార్యాచరణతో తమ తమ ప్రాంతాలకు వెళ్లారు. తొలి రోజు బుధవారం ఉదయం మహాసభలను సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో రాజకీయ, సామాజిక పరిస్థితులు, సిపిఐ కర్తవ్యం, చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలపై రాజా ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ప్రతినిధుల సభలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ సౌహార్ద సందేశాలిచ్చారు. సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 727 మంది ప్రతినిధులు మహా సభలో పాల్గొన్నారు. ఈ సారి ప్రతినిధులలో మహిళలు, యువతి, యువకులు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ప్రతినిధుల సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదికపై గురువారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు జరిగిన చర్చలో 58 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చకు కూనంనేని సాంబశివరావు సమాధానం ఇచ్చిన అనంతరం సభ ఆమోదించింది. వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలు, వివిధ వర్గాల సమస్యలపై 42 తీర్మానాలను ప్రతినిధులు ప్రవేశ పెట్టగా మహాసభ చర్చించి ఆమోదించింది. అనంతరం సిపిఐ రాష్ట్ర నూతన నాయకత్వాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ప్రజాసమస్యలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలపై ప్రజానాట్యమండలి కళాకారులు ఆలాపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

**727 మంది ప్రతినిధులు హాజరు**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభకు మొత్తం 727 ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో 619 పురుషులు, మహిళలు 71 మంది ఉన్నట్లు మహాసభ అర్హత కమిటీ ప్రకటించింది. ఇందులో వివాహితులు 590 మంది, అవివాహితుల 71 మంది ఉన్నట్లు వెల్లడించింది. 26 నుంచి 30 ఏళ్ల లోపు వారు 25 మంది, 31 నుంచి 35 మధ్య వయస్సు వారు 41మంది, 36 నుంచి 40 మధ్య వయస్సు 69 మంది, 41 నుంచి 50 లోపు వయస్సు వారు 190 మంది, 51 నుంచి 60 ఏళ్ల లోపు వారు 184 మంది 61 నుంచి 70 వయస్సు వారు 147 మంది, 71పైన బడిన వారు 34 మంది మహాసభలో పాల్గొన్నారు. 5వ తరగతి లోపు వారు 33 మంది , 10వ తరగతి లోపు 156 మంది, ఇంటర్ 148 మంది, ఐటిఐ, పాలిటెక్నిక్ 18 మంది, డిగ్రీ 169 మంది, పిజి 12 మంది, ఇంజనీరింగ్ 12 మంది, లాయర్ 38 మంది , పిహెచ్డి 2, ఆపైన 8 మంది ఉన్నారు. ఈ నివేదిక అర్హతకమి కన్వీనర్ తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు ప్రవేశపెట్టగా, ప్రతినిధుల సభ ఆమోదించింది.

**ఆడిట్ కమిషన్ నివేదిక ఆమోదం**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్లో జరిగిన సిపిఐ మూడవ మహాసభలు జరిగిన తర్వాత 2022 అక్టోబర్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు గాను జమా ఖర్చులకు సంబంధించిన వై.కష్ణమూర్తి, వివిఎస్.మూర్తి, వై.జానకిరామ్లుతో కూడిన ఆడిట్ కమిషన్ ఇచ్చిన నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు, ఆడిట్ కమిటీ సభ్యులు వై,కష్ణమూర్తి (92)ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘనంగా సన్మానించారు.

* **నవచేతన పబ్లిషింగ్ హౌజ్ పుస్తక ప్రదర్శనను తిలకించిన రాజా**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల ప్రాంగణంలో నవచేతన పబ్లిషింగ్ హౌజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సిపిఐ ఐజాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తిలకించారు. ఈ సందర్భంగా రాజా పలు పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. పుస్తకాలకు సంబంధించిన వివరాలను రాజాకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస రెడ్డి వివరించారు.

## చట్ట సభలలో..
## సిపిఐ ప్రాతినిధ్యం తోనే బడుగులకు న్యాయం

* **కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గిందన్న వారికి మునుగోడు ఎన్నికల చెంపపెట్టు**
* **సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో ఎంఎల్సి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం**




(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : ప్రస్తుత శాసనసభ, శాసనమండలి ఉభయ సభలలో సిపిఐకి ప్రాతినిధ్యం ఉండడంతో బడుగు, బలహీన, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని ఎంఎల్సి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం చెప్పారు. గడిచిన ఏడాది కాలంగా చట్టసభలలో పేద ప్రజల సమస్యలను లేవనెత్తడంతో పాటు, బయట అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్'(గాజుల రామారం)లోని 'కామ్రేడ్ ఎన్. బాలమల్లేశ్' హాల్లో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదిక (ముసాయిదా)పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించిందని చెప్పారు. దిండి ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి నల్లగొండ జిల్లాకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ 25 రోజుల పాదయాత్ర చేపట్టడం ద్వారా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని తీసుకువచ్చిన విషయాన్ని సత్యం గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన మునుగోడు ఉప ఎన్నికతో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరోసారి స్పష్టమైందని నెల్లికంటి సత్యం అన్నారు. కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గిందన్న వారికి ఇదో చెంప పెట్టు అయిందని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై చేపట్టిన దమనకాండను నిరసిస్తూ మొట్ట మొదటగా సిపిఐ ఖండించడంతో పాటు వామపక్ష పార్టీలతో కలిసి నిరసన చేపట్టినట్లు వివరించారు.




## పేదల అండ ఎర్ర జెండే

* **పేదల నమ్మకాన్ని కాపాడుకునే ఉద్యమ కార్యాచరణ ఉండాలి**
* **స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి**
* **సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి**

(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ శ్రేణులు తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని, ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలలో పార్టీ ప్రాతినిధ్యం పెంచుకోవడం ద్వారా పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్'(గాజుల రామారం)లోని 'కామ్రేడ్ ఎన్. బాలమల్లేశ్' హాల్లో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో మూడవ రోజు శుక్రవారం చాడ వెంకట రెడ్డి సందేశమిచ్చారు. సభలో చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి రాలేదని, తగిన గుర్తింపు రాలేదని విమర్శలు ఉన్నాయని, అయితే భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన చరిత్ర కలిగిన ఎర్ర జెండా వద్దకు, సిపిఐ వద్దకు వెళితేనే తమకు నీడ దొరుకుతుందనే నమ్మకం నేటికీ పేదల ప్రజలలో ఉండడం సిపిఐ గర్వకారణమన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకునే విధంగా భూపోరాటాల ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని ఆయన పార్టీ నాయకులకు సూచించారు. రాష్టంలో ధరణి పోయి భూభారతి వచ్చినప్పటీ క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. ఇప్పటికీ గ్రామ స్థాయిలో భూ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ఉద్యమాలు చేపట్టాలన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఉద్యమాలే ఊపిరి అని, తెలంగాణ రాష్ట్రంలో పార్టీని విస్తరించడానికి, బలోపేతం చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని, పార్టీని, ప్రజా సంఘాలను బలోపేతం చేసే దిశగా పార్టీ నాయకులు, శ్రేణులు కంకణబద్ధులు కావాలన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యం పేరుతో నియతృంత్వ, ఫాసిస్టు పాలనను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదవాది, ఆర్ఎస్ఎస్ వ్యక్తి గత 11 ఏళ్లుగా ఢిల్లీలో ఎర్ర కోటపై జాతీయ జెండాను ఎగురవేయడం దురదృష్టకరమన్నారు. ఈ నేపథ్యంలో బిజెపిని ఎదుర్కొనేందుకు వామపక్ష పార్టీలు ఆచీతూచీ అడుగులు వేయాలన్నారు. బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా 'బిజెపికి ఆటావో దేశ్కో బచావో' నినాదంతో దేశ వ్యాప్తంగా ప్రచారాన్ని సిపిఐ నిర్వహించిందని గుర్తు చేశారు.

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా మరోసారి కూనంనేని ఎన్నిక

* **సహాయ కార్యదర్శులుగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా**
* **ఏకగ్రీవంగా ఎన్నుకున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ**
* **పది మంది కార్యదర్శివర్గం**
* **32 మంది కార్యవర్గం సహా 101 మందితో నూతన రాష్ట్ర సమితి**

(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు రెండవ సారి ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా ఎన్నికయ్యారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్'(గాజుల రామారం) లో జరిగిన సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ చివరి రోజు శుక్రవారం నాడు నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. పది మంది కార్యదర్శివర్గ సభ్యులు, 32 మంది కార్యవర్గ సభ్యులు సహా మొత్తం 101 మందితో నూతన రాష్ట్ర సమితి ఎన్నికైంది. కార్యదర్శిగా కూనంనేని పేరును సిపిఐ సీనియర్ నాయకులు పల్లా వెంకట్ రెడ్డి ప్రతిపాదించగా, కలవేన శంకర్ బలపర్చారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర సమితి ఏక్రగీవంగా ఆమోదం తెలియజేసింది. అలాగే రాష్ట్ర సమితికి క్యాండిడేట్ సభ్యులు, ఆహ్వానితులను, రాష్ట్ర కార్యవర్గానికి ఆహ్వానితులను కూడా ఎన్నుకున్నారు. నూతన నాయకత్వాన్ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అభినందించారు. రాష్ట్రంలో సిపిఐని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గా: కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డ, పశ్య పద్మ, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహా, వి.ఎస్.బోస్, ఇ.టి. నరసింహా రాష్ట్ర కార్యవర్గం: కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహా, వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహా,బొమ్మగాని ప్రభాకర్, వి.సీతారామయ్య, పల్లా నర్సింహారెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్.కె.సాబీర్ పాషా, దండి సురేశ్, సి.హెచ్. రాజారెడ్డి, ఎస్.బాల్రాజ్, మందా పవన్, బి.విజయసారధి, కర్రె భిక్షపతి, పాలమాకుల జంగయ్య, ఎన్.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, రామడుగు లక్ష్మణ్, కలకొండ కాంతయ్య, ఇ.ఉమా మహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్ రెడ్డి, షేక్ బాసుమియా లు నియమితులయ్యారు.

**ఆహ్వానితులు గా :** గన్నా చంద్రశేఖర్, జమ్ముల జితేందర్రెడ్డి, రమావత్ అంజయ్య నాయక్, కల్లూరి వెంకటేశ్వరరావు, తాంద్ర సదానందం ఎన్నికవ్వగా, రంగారెడ్డి నుంచి ఒకరిని ఎన్నుకోవాల్సి ఉంది.

* **సిపిఐ నూతన రాష్ట్ర సమితి సభ్యులు**

రాష్ట్రకేంద్రం : కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, బాగం హేమంతరావు, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహా, ఇ.టి.నరసింహా, వి.ఎస్.బోస్, ఎన్.జ్యోతి, వి.సృజన, ఎస్. బాల్రాజ్, ఎం.డి.యూసుఫ్, కలకొండ కాంతయ్య, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, కె.మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్, వి.సీతారామయ్య, బొమ్మగాని ప్రభాకర్, బి.ఎస్.ఆర్.మోహన్రెడ్డి, ఎన్.మధుకర్, రమావత్ అంజయ్య నాయక్, పల్లె నర్సింహా, కె.శ్రీనివాస్ రెడ్డి, కె.ధనుంజయనాయుడు, మారపాక అనిల్కుమార్, జిల్లాల నుంచి: సుధాకర్ (నిజామాబాద్), ఎల్.దశరథ (కామారెడ్డి), టి.ఎం. ఖలీఖ్ (మెదక్), విజయలక్ష్మీ పండిట్ (వికారాబాద్), చెన్న విశ్వనాథం (జగిత్యాల), టి.నర్సింహా(నారాయణపేట్), బి.ఆంజనేయులు (గద్వాల్), బి. బాలకిషన్ (మహబూబ్నగర్), తోట మల్లిఖార్జున్రావు (ములుగు), ముడుపు ప్రభాకర్ రెడ్డి (ఆదిలాబాద్), బద్రి సాయికుమార్ (ఆసిఫాబాద్), మంద సుదర్శన్ (సిరిసిల్లా), కె.విజయరాములు (వనపర్తి), సయ్యద్ జలాలుద్దీన్ (సంగారెడ్డి), మేకల రవి, షేక్ బాసుమియా, పంజాల రమేశ్ (వరంగల్), పంజాల శ్రీనివాస్, అందె స్వామి (కరీంనగర్), రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్ (మంచిర్యాల), తాంద్ర సదానందం, గోశిక మోహన్ (పెద్దపల్లి), దండి సురేశ్, జమ్ముల జితేందర్ రెడ్డి, ఎర్ర బాబు, ఎస్.కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు (ఖమ్మం), ఎస్.కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, సారెడ్డి పుల్లారెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి (కొత్తగూడెం), ఎస్.ఎం.డి.ఫయాజ్ (నాగర్ కర్నూల్), మందా పవన్, కె.శంకర్ (సిద్ధిపేట్), నెల్లికంటి సత్యం, పల్లా నర్సింహా రెడ్డి, ఎల్.శ్రవణ్కుమార్ (నల్లగొండ), గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లావుల రాములు (సూర్యాపేట), గోదా శ్రీరాములు, యానాల దామోదర్రెడ్డి, బొలగాని సత్యనారాయణ, చేడె చంద్రయ్య (యాదాద్రి భువనగిరి), పాలమాకులు జంగయ్య, పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, ఎం.డి.ఫమీదా, ఓరుగంటి యాదయ్య (రంగారెడ్డి), ఇ.ఉమా మహేశ్, జి.దామోదర్రెడ్డి (మేడ్చల్), కర్రె భిక్షపతి, అదారి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మందా సదాలక్ష్మి (హన్మకొండ), కొరిమి రాజ్కుమార్ (భూపాలపల్లి), సి.హెచ్.రాజారెడ్డి , పాతూరి సుగుణమ్మ (జనగామ), బి.విజయసారధి, బి.అజయ్ సారధి (మహబూబాబాద్), స్టాలిన్, ఛాయాదేవి (హైదరాబాద్), ఇన్సాఫ్(1), నిర్మల్ జిల్లా(1), మజ్దూర్ ఫ్రంట్ (1), రంగారెడ్డి (2) సభ్యులను ఎన్నుకోవలసి ఉంది.

**క్యాండిడేట్ సభ్యులు గా:**

ముడుపు నళిని (మహిళా ఫ్రంట్), ఎం.నర్సింహా, బి.వెంకటేశ్ (ట్రేడ్ యూనియన్), ఆజ్మీరా రామ్మూరి (గిరిజన సంఘం), కె.భూమయ్య (ఎఐకెఎస్), కె.వి.ఎల్.(అయిప్సో), జోగుల మల్లయ్య (మంచిర్యాల), సిద్ధినేని కరుణాకర్ (ఖమ్మం), సలిగండి శ్రీనివాస్ (కొత్తగూడెం), బంటు వెంకటేశ్వర్లు (నల్లగొండ), ఉస్తేల నారాయణరెడ్డి (సూర్యాపేట), టి.రామకృష్ణ, బుద్దుల జంగయ్య (రంగారెడ్డి) లు నియమితులైయ్యారు.

**ఆహ్వానితులు గా**

కె.సూర్యనారాయణ (ఎఐకెఎస్), కె.శ్రీనివాస్ (ప్రజానాట్యమండలి), టి.వెంకట్రాములు (వృత్తి సంఘాలు), ఎస్. బాబు (ఆర్టిసి), జానకిరామ్ (బ్యాంకింగ్), వి.చెన్నకేశవరావు (సి.ఆర్.ఫౌండేషన్), ఉజ్జిని రత్నాకర్రావు (తెలంగాణ అమరవీరుల ట్రస్ట్), కట్టెబోయిన శ్రీనివాస్ (మహబూబాబాద్), ఇప్ప కాయల లింగయ్య, బొల్లం పూర్ణిమ (మంచిర్యాల), ఎం.డి.సలీమ్ , బి.జి. క్లైమెంట్ (ఖమ్మం), ఎస్.డి.సలీమ్, రావులపల్లి రవికుమార్, చంద్ర నరేంద్ర కుమార్ (కొత్తగూడెం), వర్ల వెంకటయ్య, కౌకుంట్ల కేశవులుగౌడ్ (నాగర్కర్నూల్), ఉజ్జిని యాదగిరిరావు (నల్లగొండ), ఆది సాయన్న (జనగామ), నల్లు సుధాకర్ రెడ్డి (మహబూబాబాద్), కమతం యాదగిరి, జి.చంద్రమోహన్గౌడ్ (హైదరాబాద్), తోట భిక్షపతి (హన్మకొండ), గౌతమ్ గోవర్ధన్ (పెద్దపల్లి), కె.ఏసురత్నం (మేడ్చల్ మల్కాజ్గిరి), వీరభద్రయ్య (సింగరేణి), సిద్ధిపేట (1), యాదాద్రి భువనగిరి(1), రంగారెడ్డి (1)ల నుంచి ఒక్కొక్కరిని ఎన్నుకోవలసి ఉంది.

## యూరియా సరఫరాకు చొరవ చూపండి!

* **కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, సంజయ్లకు తుమ్మల వినతి**

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాకు చొరవ తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్రెడ్డి, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్లను కోరారు. సచివాలయంలో శుక్రవారం యూరియాపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కిషన్రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. రాష్ట్ర అవసరాల దృష్ట్యా కేంద్రం ఈ నెలలో 50 వేల టన్నులు సరఫరా చేస్తామని చెప్పిందని... కానీ 28,600 టన్నులు కేటాయించి, అందులో 13,000 టన్నులు మాత్రమే పంపిణీ చేసిందని తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో అత్యధిక యూరియా వినియోగం దృష్ట్యా 3 లక్షల టన్నులను సత్వరమే పంపిణీ చేయించాలని అభ్యర్థించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కిషన్రెడ్డి యూరియా త్వరగా సరఫరా అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బండి సంజయ్తోనూ తుమ్మల మాట్లాడారు. రామగుండం ఎరువుల కర్మాగారం పనిచేయని కారణంగా ఉత్పత్తి జరగక 63 వేల టన్నుల యూరియా సరఫరా నిలిచిపోయిందని, దానిని వెంటనే కర్మాగారం నుంచి రవాణా అయ్యేందుకు సహకరించాలని కోరారు.



# అభివృద్ధిలో ఆందోల్ ను మొదటి స్థానంలో నిలుపుతా

* విద్యా, వైద్య, రవాణా సౌకర్యాల మెరుగు కు ప్రత్యేక శ్రద్ధ...
* సింగూరును టూరిస్ట్ హబ్ గా మారుస్తా...
* రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ. దామోదర రాజనర్సింహ...
* రూ.70 కోట్ల అభివృద్ధి పనులకు కలెక్టర్ తో కలిసి మంత్రి శంకుస్థాపన...





అందోలు, ప్రజాస్ఫూర్తి: ఆందోలు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా మార్చుతానని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సీ. దామోదర్ రాజ నర్సింహ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్యం తో కలిసి అందోల్ నియోజకవర్గ పరిధిలోని మునిపల్లి మండలంలో వివిధ గ్రామాలలో రూ.70 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుదేరా సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... బుదేరా కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను మెరుగుపరిచి రానున్న ఆరు నెలల్లో కళాశాలను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కళాశాలలకు రోల్ మోడల్ గా మార్చేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. కళాశాలలో చదివే విద్యార్థులకు భద్రత కల్పించడంతోపాటు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు అధునాతన సౌకర్యాలతో కూడిన ల్యాబ్ లు, డిజిటల్ తరగతి గదులు, మెరుగైన ఫర్నిచర్, లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కళాశాలలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుకు కృషి చేయునట్లు తెలిపారు. గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మంత్రి పరిశీలించారు.వెంటనే భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మునిపల్లి మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సంక్షేమ పథకాలు అమలుపై సమీక్ష జరిపి గ్రామస్తులతో మాట్లాడారు.

*** సింగూర్ ప్రాజెక్టును టూరిస్ట్ హబ్ గా మారుస్తా: మంత్రి**

త్వరలో సింగూరు ప్రాజెక్ట్ ను టూరిస్ట్ హబ్ గా మార్చనున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మునిపల్లి మండలంలోని గార్లపల్లి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించిన తర్వాత జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. బుదేరా నుండి సీరూరు వరకు సింగూరు బ్యాక్ వాటర్ వెంట రెండు లైన్ల రోడ్డు ఏర్పాటు కోసం రూ. 60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా గార్లపల్లిలో హై లెవెల్ వంతెన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ రోడ్డుతో సింగూరు ప్రాజెక్టు వెనుక భాగంలోని రాయికోడ్ మునిపల్లి మండలాలలో గ్రామాలు అభివృద్ధి చెందనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు కు 100 కిలోమీటర్ల లోపు ఉన్న పెద్ద ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టు అన్నారు. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మార్చడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు సింగూరు ప్రాజెక్టు మధ్యలో రామచంద్రాపురం శివారులో నీట మునుగకుండా ఉన్న 15 ఎకరాల విస్తీర్ణం లోని భూమిలో రిసార్ట్ హోటలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో సింగూరు బ్యాక్ వాటర్ వెంట గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేటు ఆధ్వర్యంలో రిసార్ట్లో ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. హైదరాబాదు నుండి సింగూరు ప్రాజెక్టు చూడడానికి వచ్చే టూరిస్టులు సింగూరు ప్రాజెక్టును చూసి పడవలలో రామచంద్రపురం రిసార్ట్ కు వచ్చి మధ్యాహ్నం భోజనం చేసుకొని రాత్రి సింగూరు బ్యాక్ వాటర్ వెంట వెలిసే రిసార్టలో విశ్రాంతి తీసుకునేలా టూరిస్టు హబ్ ను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. బుదేరా సిరూరు రోడ్డు ఏర్పాటుతోపాటు సింగీతం నుండి కోడూరు వరకు రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు ఈ రెండు రోడ్ల నిర్మాణంతో సింగూరు బ్యాక్ వాటర్ గ్రామాలకు మెరుగైన రోడ్డు రవాణా సౌకర్యాలు కలగడంతో పాటు ఈ ప్రాంతం టూరిస్ట్ హబ్ గా మారనున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

*** రూ. 70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..:**

మునిపల్లి పర్యటన సందర్భంగా మంత్రి మండలంలో ని వివిధ గ్రామాలలో రూ. 70 కోట్ల నిధులతోపలు అభివృద్ధి పనులకు మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.2.20 కోట్లతో సాంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, బుదేర లో ఆదనపు తరగతి గదులు , ప్రహరీ గోడ నిర్మాణం.రూ.43 లక్షలతో కళాశాలలో మౌళిక సదుపాయాలు, రూ.98 లక్షలతో మునిపల్లి ఖమ్మంపల్లి బి.టి. రోడ్డు నిర్మాణం, రూ.1.24 కోట్లతో మోడల్ స్కూల్, మునిపల్లిలో చేసిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం. రూ.34.50 లక్షలతో యస్.సి. బాయ్స్ హాస్టల్, మునిపల్లిలో పలు అభివృద్ధి పనులు, రూ.1.96 కోట్లతో మునిపల్లి చందాపూర్ బి.టి.రోడ్డు నిర్మాణం, రూ.1.26 కోట్లతో పి.డబ్ల్యుడి రోడ్డు తక్కెడల్లి బి.టి. రోడ్డు నిర్మాణం. రూ.57.50 లక్షలతో కె.జి.బి.వి. తాటిపల్లి లో మౌళిక సదుపాయాలు, రూ.37 లక్షలతో నిర్మించిన వంటశాల, ఇతర మరమ్మత్తులకు ప్రారంభోత్సవం, రూ.42 కోట్లతో తాటిపల్లిమక్తక్యాసారం డబల్ రోడ్డు నిర్మాణం,రూ.17 కోట్లతో గార్లపల్లిలో హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ కలెక్టర్ పి ప్రావీణ్య త తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల చైర్మన్ అంజయ్య, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, ఉపాధ్యాయులు ప్రిన్సిపల్స్, వివిధ శాఖల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## 11 అడుగుల భారీ కొండచిలువను పట్టిన ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ సభ్యులు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం గౌతంపూర్ కాలనీలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. అక్కడ నివాసం ఉంటున్న రాజు ఇంటి వద్ద ఆయన పెంచుకుంటున్న కోళ్ల బోనలోకి 11 అడుగుల భారీ కొండచిలువ ప్రవేశించింది. పెద్ద కోడిపుంజును మింగేసి, చుట్టుకుని పడుకున్న ఆ దృశ్యం చూసిన యజమాని రాజు భయాందోళనకు గురయ్యాడు.తక్షణమే ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ సభ్యులు మహేష్, దత్తులకు సమాచారం అందించగా, వారు వేగంగా అక్కడికి చేరుకుని చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం ఆ సర్పాన్ని సురక్షితంగా సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.ఈ సందర్భంగా ప్రాణధార ట్రస్ట్ అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ, "కొండచిలువలు అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో ఉన్నాయి. ఇవి విషరహితమైన సర్పాలు కావడంతో మనుషులకు ఎలాంటి హాని చేయవు. కనుక ఎవరి ఇళ్ల వద్దనైనా ఇలాంటి పాములు కనిపించినప్పుడు భయపడకుండా, చంపకుండా, వెంటనే సమాచారం అందించాలి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఘనంగా"డిఆర్ఎస్ ఎంయూఎన్ 2025" వేడుకలు

*** కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :గుండ్ల పోచంపల్లి మైసమ్మ గూడ లో గల డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ లో నిర్వహించిన "డిఆర్ఎస్ ఎంయూఎన్ 2025" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఈవెంట్ లను నిర్వహించడం ద్వారా విద్యార్థులలో సామాజిక స్పృహ, క్లిష్టతరమైన సమస్యల పరిష్కారం, నాయకత్వ లక్షణాలు వంటి వాటిని పెంపొందించుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఏకె.అగర్వాల్, గర్వ్ అగర్వాల్, ప్రిన్సిపల్ వేణు గోపాల్, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం మణుగూరులోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల , తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల , వసతి గృహం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తరగతి గదులు, భోజనశాల, వసతి గృహాలు, పాఠశాల పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు. హాస్టల్ తనిఖీ సమయంలో విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటించి, వసతి సౌకర్యాలు, పరిశుభ్రత, త్రాగునీరు, మంచం, దుప్పట్లు, స్నానాల గదులు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన, విద్యార్థుల చదువుపై ఆసక్తి, ఉపాధ్యాయుల బోధన నాణ్యత, అభ్యాస స్థాయి పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, ప్రభుత్వమందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉపాధ్యాయులు పాఠ్యబోధనతో పాటు పోటీ పరీక్షల శిక్షణను కూడా అందించాలని ఆయన గైడ్ చేశారు. భోజనశాల పరిశీలనలో, ఆహార పదార్థాల నిల్వ, వంటశాల శుభ్రత, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను కలెక్టర్ ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. తాజా పదార్థాలతోనే వంట చేయాలని, ఆహారం పోషకాహారంతోనూ, రుచికరంగానూ ఉండేలా జాగ్రత్త పడాలని సిబ్బందికి ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదు అని, వసతి, భోజనం, శుభ్రత, భద్రతపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి అని ఆదేశించారు. విద్యార్థులు పుస్తకాలతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ప్రతిభ కనబరచేలా అవకాశాలు కల్పించాలి అన్నారు. పాఠశాలల నెలకొన్న సమస్యలపై నివేదికలు అందించాలని తక్షణమే పరిష్కారం చూద్దామని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.




## ప్రజావాగ్గేయకారుడు దరువు అంజన్నకు దక్కిన గౌరవం

**: ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ వారిచే దాశరధి , సినారే ఎక్సలెన్స్ 2025 అవార్డు ప్రదానం**

ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ వారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అవార్డుల ప్రధానోత్సవంలో జానపద, సంగీత,విద్య,సాహిత్య, సామాజిక సేవా, రంగాలలో సేవ చేసిన వారిని, అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి దాశరధి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలు డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా సంయుక్తంగా నిర్వహించిన దాశరధి సినారే ఎక్సలెన్స్ అవార్డు 2025 గాను ప్రజావాగ్గేయ కారులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బాషా సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్నకు ప్రధానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఇందిర మాట్లాడుతూ దరువు అంజన్న తెలంగాణ ఉద్యమంలో అగ్ర భాగాన నిలిచాడని ఎంతో పోరాటపటిమ కనబరిచాడని అన్నారు.గత 30 సంవత్సరాలుగా జానపద సాహిత్య, సామాజిక సేవ, విద్య రంగాలలో ఎనలేని ప్రతిభ కనబరుస్తున్నాడని అందుకుగాను ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఉపాధ్యక్షులు విల్సన్ మాట్లాడుతూ దరువు అంజన్న కళారంగానికి, సామాజిక రంగానికి ఎనలేని కృషి చేస్తున్నారని ఆదరణ లేని కళాకారులకు ఒక దారి చూపిస్తున్నాడని ఆయనకు ఈ అవార్డు లభించడం గర్వంగా ఉందని అన్నారు. ప్రముఖ అనంతరం గాయని ప్రసన్న మాట్లాడుతూ ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ వారు దాశరధి సినారె 2025 ఎక్సలెన్స్ అవార్డు దరువు అంజన్న లాంటి ప్రజా కళాకారులకు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను ఆదుకుంటుందని వారిలో ఉన్న ప్రతిభను వెలికితీస్తుందని భవిష్యత్తులో మంచి మంచి కార్యక్రమాలు చేపట్టి కళాకారులను ఉత్సాహపరుస్తామని అన్నాడు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భాషా సాంస్కృతిక టూరిజం ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు తమపై నమ్మకంతో ఇచ్చిన సలహాదారుల బాధ్యతను గురుతర బాధ్యతతో నిర్వహిస్తామని తెలిపాడు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ వారు నేను చేస్తున్న సేవలను గుర్తించి నాకు గౌరవనీయులైన దాశరథి కృష్ణమాచార్య డాక్టర్ సి.నారాయణరెడ్డి సంయుక్త అవార్డును ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

## వయోవృద్ధులకు చట్టాలు అండగా ఉన్నాయి

*** జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి**



ప్రజాస్ఫూర్తి ఇల్లందు : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గోవింద్ సెంటర్ నందుగల పెన్షన్ భవన్ నందు ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలోన్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు ఈ కార్యక్రమానికి జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ వయోవృద్ధులైన తల్లిదండ్రులను వారి కొడుకులు, కూతుర్లు, సంరక్షణ అందించకపోవడం వలన వయోవృద్ధులైన తల్లిదండ్రులు నిరాధారణకు గురవుతున్నారని, ఆస్తులు పంచుకుంటున్నారే గాని వారికి ప్రేమను, సంరక్షణను అందించలేకపోతున్నారని నిరాధారణకు గురైన వయోవృద్ధులు చట్టాలు రూపొందించబడ్డాయని, జిల్లా కలెక్టర్ , సబ్ కలెక్టర్ అర్జీ పెట్టుకున్నట్లయితే ఎంక్వైరీ నిర్వహించి అట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని, అంతేకాకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గాని మండల న్యాయ సేవ అధికార సంస్థను గాని, ఆశ్రయించినట్లయితే ఎటువంటి రుసుం లేకుండా అన్యాయ సమహాయం పొందవచ్చని తెలిపారు, సెక్షన్ 144 భారతీయ నాగరిక సురక్ష సంహిత సెక్షన్ ద్వారా మనోవర్తి పొందవచ్చు అని తెలిపినారు.. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాంపెల్లి ఉమామహేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దాసరి స్వామి దాసు, తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తకు ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బిసిటిఎ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో కొండాపూర్ కి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ చిగురు ఆది మల్లన్ బాబా (ఎంఎస్సి పిహెచ్డి)ను ఘనంగా సన్మానించారు. మండలంలోని వివిధ పాఠశాలల పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సిల్వర్ మెడల్స్ ఇవ్వడం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ తమ సేవలను ఇలాగే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బండారి మల్లేశం, మండల అధ్యక్షులు కాలేరు రాజన్న, డిటిఎఫ్ మండలాధ్యక్షుడు అంజగౌడ్, నాగేశ్వర్, జాతీయ బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాళ్ల సురేష్ గౌడ్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు చిగురు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచానికే ఆదర్శంగా అద్భుత నిర్మాణం

- **తెలంగాణ ఖ్యాతిని పెంచేలా యూనివర్సిటీ నిర్మాణం**
- **మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటి దేశానికి తలమానికంగా నిలవాలి**
- **అత్యాధునిక సౌకర్యాలతో 300 ఎకరాలలో నిర్మాణం**
- **అన్ని మౌళికసదుపాయాలతో యూనివర్సిటీ ప్లాన్**
- **త్వరలోనే సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక**
- **అధికారులతో వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల**






ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచానికే మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని (కొత్తగూడెం) ఆదర్శంగా నిర్మించేలా అద్భుత ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలోని మంత్రి చాంబర్ లో ప్రముఖ ఆర్కిటెక్ ఉష రూపొందించిన కొత్తగూడెం మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ నిర్మాణ ప్లాన్ ను వైస్ ఛాన్స్ లర్ యోగితారాణా ఇతర అధికారులతో కలిసి మంత్రి తుమ్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికే తెలంగాణ రాష్ట్రంలోని మన్మోహన్ సింగ్ యూనివర్సిటీ తలమానికంగా నిలిచేలా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో, అన్ని మౌళిక సదుపాయాలతో యూనివర్సిటీ నిర్మించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎక్కడ కూడా లోటుపాట్లు లేకుండా నాణ్యత ప్రమాణాలతో పకడ్బందీగా ప్లాన్ ను రూపొందించాలని మంత్రి సూచించారు. విద్యార్థులు, లెక్చరర్లు అసౌకర్యం లేకుండా విశాలమైన తరగతి గదులు, హాస్టల్లు, గ్రంథాలయాలను నిర్మించాలన్నారు. ఆర్కిటెక్ తయారు చేసిన డిజైన్లను ముఖ్యమంత్రికి త్వరలోనే చూపించి, ఆయన ఆదేశాలకు అనుగుణంగా డిజైన్లను ఆమోదం తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే ప్రారంభోత్సవ వేడుక నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. మీదుగా ఈ విషయమై భద్రాద్రి కొత్తగూడం కలెక్టర్ తో మాస్టర్ ప్లాన్ గురించి మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనాలలోనే తాత్కలికంగా తరగతులు నిర్వహించాలని, హాస్టల్ భవనాలకు మరమ్మత్తులు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. 3 సంవత్సరాలలో యూనివర్సిటీ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ దేశంలోనే మొట్టమొదటి యూనివర్సిటీ అని.. ఇది తెలంగాణ రాష్ట్రానికే కాకుండా, దేశానికే తలమానికంగా ఆకర్షనీయమైన డిజైన్లతో దీనిని నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ 300 ఎకరాల విశాల ప్రాంతంలో రూపుదిద్దుకోని, అత్యున్నత ప్రమాణాలతో వేలాది మందికి విద్య ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారనుందని మంత్రి పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీ ద్వారా వేలాది మంది యువ శాస్త్రవేత్తల దేశ భవిష్యత్తుకు బాటలు వేసే అవకాశం ఏర్పడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ నిర్మాణంతో వేలాదిమంది విద్యార్థుల ఉన్నత చదువులకు అవకాశాలు లభించడంతో పాటు శాస్త్రవేత్తలుగా తయారుచేసే అవకాశాలు కలుగుతాయని అభిప్రాయపడ్డారు.

**మంత్రి తుమ్మల ప్రత్యేక కృషి...**

మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడంలో మంత్రి తుమ్మల కృషి అపారం. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు ఆయన శ్రమిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్డేట్ చేసి ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా మార్చడంలో కీలక భూమిక పోషించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటేలా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుకు ముఖ్యమంత్రిని ఒప్పించి కృతకృత్యులయ్యారు. ప్రపంచానికే తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయం కీర్తి ప్రతిష్టలు చాటేలా మంత్రి తుమ్మల విశేష కృషి చేస్తున్నారు. ప్రభుత్వాన్ని ఒప్పించి విశ్వవిద్యాలయంగా మార్చడంలో, బిల్లు ఆమోదించడంలో తుమ్మల చూపిన చొరవ మరువలేనిది. ఖమ్మం జిల్లా ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పేలా విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలనే దృఢ సంకల్పంతో మంత్రి తుమ్మల అలుపెరుగని పోరు చేస్తున్నారు.

## ఆటంకాలు లేకుండా అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలి

- **డిజేలకు ఎలాంటి అనుమతులు లేవు**
- **గణేష్ ఉత్సవ కమిటీలతో పీస్ సమావేశం**
- **ఎస్ఓటి అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, ఏసిపి పి.మధుసూదన్ రెడ్డి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గణేష్ నవరాత్రోత్సవాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని ఎస్ఓటి అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, చౌటుప్పల్ ఏసిపి పి మధుసూదన్ రెడ్డిలు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బి ఆర్ కె ఫంక్షన్ హల్ లో గణేష్ నవరోత్రోత్సవాలను పురస్కరించుకొని గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో శుక్రవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓటి అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, ఏసిపి పి మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ మండపాల వద్ద విధ్యుత్ తీగలతో జాగ్రత్తలు పాటించాలని, రాత్రి 10గంటలకు లౌడ్ స్పీకర్లు ఆఫ్ చేయాలని సూచించారు. గణేష్ విగ్రహ ఏర్పాటు కోసం ప్రజల నుండి డబ్బులను బలవంతంగా వసూలు చేయవద్దని, గణేష్ మండపాలను ఎవరికి, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా డి.జె / డి.జె మిక్సర్స్ / హైఫిడిలిటి ( హైఫై ) సౌండ్సిస్టమ్ ఇక్విప్మెంటు విషయంలో చాలా జాగ్రతలు వహించాలని, కొద్ది మంది ఇండ్లలో గుండె జబ్బులు, బి.పి, వయసుపై బడిన వృద్దులు, చదువుకునే విద్యార్థులకు ఆటంకము కలుగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డి.జే లు పూర్తిగా నిషేధించాలని, మైక్ పర్మిషన్ కోసం సంబంధిత ఎ.సి.పి ని సంప్రదించి తప్పని సరిగా పర్మిషన్ తీసుకోవాలన్నారు. విధ్యుత్ సరఫరా ఆగకుండా వీధి దీపాలు వెలిగేటట్లు చూసుకోవాలని, షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలన్నారు. ప్రతీ గణేష్ మండలి వద్ద ఉదయం వేళలో, రాత్రి వేళలో ఇద్దరూ లేదా ముగ్గురికి తక్కువ కాకుండా తమ కమిటీ మెంబర్లను మండలి వద్ద ఉండాలన్నారు. పోలీసులు చెకింగ్ కు వచ్చినప్పుడు ప్రతీసారి కనపడాలని, అదేవిధంగా మండపము దగ్గర అసాంఘిక చర్యలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండలి దగ్గర విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని, పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారన్నారు. ఈ సమావేశంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్, ఎస్ఐలు కనకటి యాదగిరి, కృష్ణ మాల్, రమేష్, నర్సిరెడ్డి, ఉపేందర్రెడ్డి, అజయ్ భార్గవ్, మున్సిపల్ కమిషనర్ గుత్త వెంకట్రాంరెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా దినోత్సవాలను ఉత్సాహభరితంగా నిర్వహిద్దాం

**అధికారులతో సమీక్షలో మంత్రి వాకిటి శ్రీహరి**

హైదరాబాద్: రాష్ట్రంలో శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్ని అన్నివర్గాల భాగస్వామ్యంతో ఉత్సాహభరితంగా నిర్వహించాలని క్రీడలు, యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. స్వచ్ఛంద, విద్యా సంస్థలతోపాటు క్రీడాకారులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి సచివాలయంలో క్రీడాధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ''గ్రామీణ క్రీడా మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యమివ్వాలన్న రాష్ట్రప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలి. అకాడమీలు, స్పోర్ట్స్ స్కూళ్లను బలోపేతం చేయాలి. క్రీడారంగం బలోపేతానికి ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, కోచ్ ల సంఖ్యను పెంచాలి.

## ఇల్లందు నియోజకవర్గం
# ఎమ్మెల్యే కోరం కనకయ్య సుడిగాలి పర్యటన



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ప్రజల వద్దకే పాలనను అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఇల్లందు నియోజకవర్గం ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. తెలంగాణ రాష్ట ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టించాలనే సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పనుల జాతర కార్యక్రమంలో భాగంగా కామేపల్లి, గార్ల, బయ్యారం, ఇల్లందు, టేకులపల్లి మండలాలోని పలు గ్రామ పంచాయితిలలో నిర్మాణ పూర్తి అయిన పంచాయితి భవనాలను ఫ్రారంభోత్సవం చేసి,నూతన అంగన్ వాడీలకు శంకుస్థాపన చేసి,పశుల షెడ్లకు శంకుస్థాపన ఫ్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, నాయకులు మేకల మల్లిబాబు, వడ్లముడి దుర్గా ప్రసాద్, మూల మధుకర్ రెడ్డి, లక్కినేని సురేందర్, మండల రాము, ధనియాకుల హనుమంతరావు, పుచ్చకాయల వీరభద్రం, మాళోత్ మంగిలాల్, మండల పార్టీ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, ధనియాకుల రామారావు, పులి సైదులు, మార్కెట్ కమిటి డైరెక్టర్లు మాళోత్ బావు సింగ్, భుక్యా అశోక్, మాజీ జెడ్పిటిసి జాన్సి, దమ్మాలపాటి సత్యనారయణ, ఏపూరి మహేందర్, రాంరెడ్డి జగన్నాధ రెడ్డి, పత్తే మధు, మాళోత్ వెంకటలాల్, సనప సోమేష్, కారం భాస్కర్, జంపన్న, సర్దార్, ఈది గణేష్, రెడ్యా నాయక్, మాదుగుల సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, పూనెం సురేందర్, బండి ఆనంద్, దండుగుల శీవ, తాటి భిక్షం, మూతి క్రిష్ణ, జోగా శ్రీకాంత్, చెన్నూరి క్రిష్ణ, చీమల నాగరత్నం, కల్తీ పద్మ, మోకాళ్ళ వెంకటమ్మ, పాయం స్వాతీ, నాగార్జున్, భుక్యా శంకర్, బొల్లి రామారావు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మార్వాడీలు తెలంగాణ పల్లెల్లోకి చొరబడి స్థానిక వ్యాపారుల ఉపాధిని కొల్లగొడుతుండ్రు

- **చౌటుప్పల్ క్లాత్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి శ్యామ్**
- **మన ఊరు మన వ్యాపారం మార్వాడీ గో బ్యాక్ అంటూ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వ్యాపారుల నిరసన ర్యాలీ**
- **జేఏసీ పిలుపు మేరకు పట్టణ కేంద్రంలో స్వచ్ఛందంగా షాపులు బంజేసిన స్థానికులు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మార్వాడి వ్యాపారి హటావో తెలంగాణ వ్యాపారి బచావో అంటూ ఓయూ జెఏసి పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా (మార్వాడి గో బ్యాక్) నినాదం ఇవ్వడంతో శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించి, నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో వివిధ వ్యాపార సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ క్లాత్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి శ్యామ్, మాజీ అధ్యక్షులు తడక నరసింహ నేత మాట్లాడుతూ గతంలో తెలంగాణను ఆంధ్ర పాలకులు దోచేస్తే, ఇప్పుడు గుజరాత్ రాజస్థానీ మార్వాడీలు దోచేస్తున్నారని అన్నారు. ఇది తెలంగాణ వ్యాపారులను దెబ్బతీస్తూ, గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించిన మార్వాడీ లు అనేక వ్యాపారాలు చేస్తూ రాష్ట్రంలో స్థానిక వ్యాపారుల పొట్టగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వాళ్ల పెద్ద పెట్టుబడుల ధాటికి తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా చిరు వ్యాపారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు.తెలంగాణ పండగల స్ఫూర్తిని మార్వాడీలు దెబ్బతీస్తున్నారని,ఆహార ఉత్పత్తులు, సరుకుల కల్తీ దందాలో 97శాతం మార్వాడీలే ఉన్నారని ఆరోపించారు. ముఖ్యంగా హైదరాబాద్ కు కూత వేటులో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పూర్తిగా మార్వాడీలు అనేక వ్యాపారాలను విస్తరించుకోవడంతో, ఎన్నో సంవత్సరాలుగా వ్యాపారాలను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న స్థానికులమైన మేము మార్వాడీల వల్ల తమ జీవనం గడవలేకపోతుందని, మునుముందు తమ వ్యాపారాలు కొనసాగుతాయా లేవో నన్న నమ్మకం కూడా కలగడం లేదని తెలిపారు. ఇది పట్టణ కేంద్రాలలోనే కాదు, తెలంగాణలోని అన్ని గ్రామీణ ప్రాంతాలలో కూడా మార్వాడీలు విస్తరిస్తూ అన్ని రకాల వ్యాపారాలను కబ్జా చేస్తున్నారని అన్నారు. నాణ్యత లేని నాసిరకం వస్తువులను అమ్ముతూ ఈ ప్రాంత వ్యాపారస్తులను పరోక్షంగా దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్వాడీల విస్తరణతో స్థానిక యువత ఉపాధి కోల్పోతున్నారని ఆరోపించారు. మార్వాడి షాపులలో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించకుండా వారి ప్రాంతాల నుంచి మనుషులను తీసుకువచ్చి లేబర్లుగా పెట్టుకుంటున్నారని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే తెలంగాణ ప్రజల మనుగడకు ముప్పు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. తెలంగాణ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో అన్ని స్థానిక వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా బంధు చేసి, నిరసన వ్యక్తం చేశామని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మార్వాడీలు తెలంగాణ పల్లెల్లోకి చొరబడి స్థానిక వ్యాపారుల ఉపాధిని దెబ్బ తీయకుండా చూడాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ మహమ్మద్ సలీం అకాల మరణం పార్టీకి తీరని లోటు

- **సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు కుత్బుల్లాపూర్ మండల సీనియర్ నాయకులు రోడా మేస్త్రి నగర్ బి కు చెందిన కామ్రేడ్ మహమ్మద్ సలీం అకాల మరణం పార్టీకి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం అన్నారు. శుక్రవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సంతాప కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి సత్యం పాల్గొని కామ్రేడ్ సలీం భౌతిక కాయం పై పార్టీ జెండాను కప్పి ఉద్యమ సహచరునికి జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుదకంటూ పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పని చేసిన నిజమైన కార్యకర్త. మొత్తం కుటుంబాన్ని పార్టీలో కి తీసుకుని వచ్చిన త్యాగధునుడు పార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ లో జరిగిన భూ పోరాటంలో పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ స్థలాలు పేదలతో ఆక్రమించి న సందర్భంలో పోలీసులు లాటి ఛార్జ్ లను లెక్కచేయకుండా ప్రజల పక్షాన పోరాడిన నాయకుడన్నారు. 2000 సంవత్సరంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన విద్యుత్ ఉద్యమంలో ప్రజలను సమీకరించి పోరాడిన నాయకుడు కామ్రేడ్ సలీం పార్టీ ఏ కార్యక్రమం తీసుకున్నా తన వంతు కృషి చేస్తూ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే నాయకుడన్నారు. ఆరోగ్యం సహకరించకున్నా పట్టుదలతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకుడని కడవరకు కమ్యూనిస్టుగా ఉండి ఎర్ర జెండా నీడలో ఒదిగిన కామ్రేడ్ సలీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రావుల వరప్రసాద్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొడిగ లింగస్వామి, మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, రావుల స్వాతి, ఈ దేవదానం, కరుణాకర్, బురాన్, జాకీర్ హుస్సేన్, ఆరిఫ్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖన పోటీలలో జడ్పిహెచ్ఎస్ లింగోజిగూడెం విద్యార్థుల ప్రతిభ




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు కల్టివేటింగ్ ఆర్ట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో పర్యావరణంపై నిర్వహించిన చౌటుప్పల్ మండల స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఇద్దరు విద్యార్థులు గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించారు. ఆ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమాజ సేవకుడు పర్నె శివారెడ్డి ఏడుగురు విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన జంపాల అక్షయ, ద్వితీయ స్థానం పొందిన ఊదరి జయవర్ధన్ లకు గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ ప్రోత్సాహక బహుమతులు రూ.2వేలు, రూ.1వెయ్యి చొప్పున అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగోజిగూడెం ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు కూరెళ్ళ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమాజ సేవకుడు శివారెడ్డి, లింగస్వామిలు ముఖ్య అతిథిగా విచ్చేసి, పాఠశాలకు ఇంకా ఏమైనా అవసరాలు కనుక ఉన్నట్లయితే తీరుస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణ వైద్యశాఖలో 1,623 పోస్టులకు నోటిఫికేషన్.. పోస్టుల వివరాలివే..!

హైదరాబాద్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. 1,623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి శుక్రవారం సాయంత్రం నోటిఫికేషన్ వచ్చింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో 1616, ఆర్టీసీ ఆస్పత్రుల్లో 7 పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు సెప్టెంబర్ 8 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. తాజా నోటిఫికేషన్ ప్రకారం పోస్టుల భర్తీ పూర్తయితే తెలంగాణ వైద్య విధాన పరిషత్ లోని ఆస్పత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్ల సంఖ్య పెరగనుంది. తద్వారా జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోనూ వైద్యసేవలు మరింత మెరుగు కానున్నాయి. పల్లెలకు స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ కానున్నాయని వైద్య ఆరోగ్యశాఖ



మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్యశాఖలో ఇప్పటికే దాదాపు 8 వేల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిందని.. మరో 7వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే.. వేరేగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

## ఇది వైకాపా తెలుగు ప్రజలకు చేసిన ద్రోహం కాదా?: వైఎస్ షర్మిల



అమరావతి: వైకాపా ముసుగు మళ్లీ తొలగిందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. భాజపాకు వైకాపా.. బీ టీమ్ అని నిజ నిర్ధరణ జరిగిందన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థికి మద్దతుతో మరోసారి తేటతెల్లమైందని పేర్కొన్నారు. ‘‘రాష్ట్రంలో ప్రతిపక్షం ముసుగులో ఉన్నది మోదీ పక్షమేనని తేలింది. అవినీతి కేసులకు భయపడి భాజపాకు వైకాపా మళ్లీ దాసోహం అంటోంది. ఓటు చోరీతో రాజ్యాంగం ఖూనీ అయ్యేది వైకాపాకు కనిపించదు. ఓ తెలుగు బిడ్డ, న్యాయ నిపుణుడిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెడితే మద్దతు ఇవ్వలేరా? ఇది తెలుగు ప్రజలకు చేసిన ద్రోహం కాకపోతే మరేంటో వైకాపా చెప్పాలి’’ అని షర్మిల ప్రశ్నించారు.

## చిమ్మ చీకట్లు అలముకోవడమే మహానగరమా?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: వీధి లైట్లు వెలగని నగరం దేశంలో ఏదైనా ఉందంటే అది హైదరాబాదేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చీకటి పడితే వీధిలైట్లు వెలగక దయనీయమైన పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కడ ఉందో అక్కడే వెలుగులా అని విమర్శించారు. ప్రభుత్వం రియల్ హైదరాబాద్ వదిలేసి.. రియల్ ఎస్టేట్ హైదరాబాద్ చుట్టూ తిరుగుతోందని ధ్వజమెత్తారు. నాడు కేసీఆర్ విశ్వనగరం అన్నారు..



రేవంత్‌రెడ్డి అంతకన్నా మహా విశ్వనగరం అంటున్నారని ఎద్దేవా చేశారు. చిమ్మ చీకట్లు అలముకోవడం మహానగరమా? అని ప్రశ్నించారు. మౌలిక వసతుల్లేక నగర ప్రజలు అల్లాడుతున్నారని, ఎక్కడ చూసినా డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతోందన్నారు. హౌస్ అరెస్టులు చేసేంత భయం ప్రభుత్వానికి ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని, పార్టీ నేతలను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. అరెస్ట్‌లకు భయపడేది లేదని, అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. బేషరతుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

# కేకు తినిపించిన చేతులతోనే బాలిక ప్రాణాలు తీశాడు!

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగీత్‌నగర్‌లో సంచలనం సృష్టించిన పదేళ్ల బాలిక సహస్ర దారుణ హత్య వెనుక మిస్టరీ వీడింది. బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ నేతృత్వంలో పోలీసులు 5 రోజులు శ్రమించి నిందితుడైన మైనర్ బాలుడిని అరెస్టు చేశారు. దొంగతనానికి వెళ్లిన బాలుడు.. ఈవిషయాన్ని బాలిక ఎవరికైనా చెబుతుందేమోనన్న భయంతోనే దారుణానికి ఒడిగట్టినట్టు ప్రాథమికంగా నిర్ధరించినట్టు సమాచారం. దొంగతనం చేసేందుకు వచ్చిన బాలుడు డబ్బులు తీసుకొని వెళ్తుండగా.. బాలిక చూడటం గమనించి విషయం బయటకు తెలుస్తుందని భయపడి ఉంటాడని భావిస్తున్నారు. అందుకే కత్తితో అత్యంత దారుణంగా బాలికను హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, తన వెంట తెచ్చుకున్న కత్తితో చంపేశాడా? లేక ఘటన జరిగిన ఇంట్లోని కత్తినే ఉపయోగించాడా?అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. హత్య జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడని పోలీసులు నిర్ధరించారు. హత్య జరిగిన రోజు నుంచి అనుమానం రావడంతో స్కూల్‌కి వెళ్లిన బాలుడిని విచారించి ఈరోజు సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల జరిగిన సహస్ర పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఆమెకు కేకు తినిపించాడు. కేకు తినిపించిన చేతులతోనే బాలిక ప్రాణాలు తీయడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. దొంగతనం చేసే ముందు చోరీ ఎలా చేయాలి?ఎలా బయటకు వెళ్లాలనే విషయాలను బాలుడు రాసుకున్నట్టుగా అనుమానిస్తున్న ఓ పేపర్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. దాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు వాస్తవాలు నిగ్గు తేల్చే పనిలో పడ్డారు. హత్య జరిగిన ఇంట్లో మరోసారి క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. బాలానగర్ జోన్ డీసీపీ కె.సురేష్ కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి పర్యవేక్షణలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నారు. త్వరలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించనున్నట్టు కూకట్ పల్లి పోలీసులు తెలిపారు.

### ఏం జరిగిదంటే..

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం ముక్తాక్యాసారం గ్రామానికి చెందిన కృష్ణ, రేణుక దంపతులు ఐదేళ్లుగా కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కృష్ణ స్థానికంగా మెకానిక్ షెడ్డులో పనిచేస్తుండగా, రేణుక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్. వీరికి కుమార్తె సహస్ర(10), కుమారుడు(7) ఉన్నారు. సహస్ర బోయిన్‌పల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతోంది. కుమారుడు ఇంటికి సమీపంలోని బడికి వెళ్తున్నాడు. సోమవారం ఉదయం యథావిధిగా తల్లిదండ్రులు విధులకు వెళ్లగా, వారి కుమారుడు పాఠశాలకు వెళ్లాడు. క్రీడోత్సవాల నేపథ్యంలో పాఠశాలకు సెలవు ఇవ్వడంతో బాలిక ఒంటరిగా ఇంట్లో ఉంది.

### స్కూల్ నుంచి ఫోన్ రావడంతో

తానే స్కూల్‌కు వెళ్లి తమ్ముడికి లంచ్‌బాక్సు ఇస్తానని బాలిక చెప్పడంతో తల్లి భోజనం సిద్ధం చేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ‘లంచ్ బాక్సు తీసుకురాలేదేమంటూ’ స్కూల్ సిబ్బంది.. కృష్ణకు ఫోన్ చేయడంతో ఆయన




హుటాహుటిన ఇంటికి వెళ్లారు. తలుపు బయట నుంచి గడియ పెట్టి ఉండటంతో తెరిచారు. కుమార్తె శరీరంపై కత్తిపోట్లతో మంచంపై విగతజీవిగా కనిపించడంతో భయభ్రాంతులకు గురై కేకలు వేశారు. ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారమిచ్చారు.

### బాలిక ఒంటి మీద 20 కత్తి గాట్లు..

బాలిక శరీరంపై 20వరకు కత్తి గాయాలున్నాయి. మెడపైనే 10 ఉన్నాయి. పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక ప్రకారం.. హత్య సోమవారం ఉదయం 9.3010.30 గంటల మధ్య జరిగినట్లు సమాచారం. ఆ సమయంలోనే బాలిక కేకలు వినిపించినట్లు పక్క భవనంలో నివసించేవారు పోలీసులకు సమాచారమిచ్చారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. జాగిలం ఘటనా స్థలం నుంచి నేరుగా కిందికి వెళ్లింది. దర్యాప్తులో భాగంగా సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలు సేకరించి.. గత ఐదు రోజులుగా అన్ని కోణాల్లో సమాచారం సేకరించిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.



## 25న తెలంగాణ కేబినెట్ భేటీ.. స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశం

హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గ సమావేశం సచివాలయంలో ఈనెల 25న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. మరో వైపు పంచాయతీ ఎన్నికల కోసం హైకోర్టు విధించిన గడువు సెప్టెంబరు 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముంది. శనివారం జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న కేబినెట్ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం.. ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించే వీలుంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక అంశంలో హైకోర్టు విచారణపై కూడా చర్చించి.. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా నిర్ణయం తీసునే అవకాశం ఉంది.

## కేసీఆర్‌తో పార్టీ నేతల భేటీ.. కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ

గజ్వేల్: కాళేశ్వరం ఆనకట్టల్లో లోపాలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ (KCR).. పార్టీ నేతలతో సమావేశమయ్యారు. కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణను హైకోర్టు ఐదు వారాలకు వాయిదా వేసింది. దీంతో తదుపరి ఏం చేయాలన్న విషయమై కేసీఆర్ దృష్టి సారించారు. హైకోర్టులో విచారణ ముగిసిన అనంతరం హరీశ్‌రావు ఎర్రవెల్లి వెళ్లారు. కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి,



వినోద్ కుమార్, దామోదర్ రావు తదితరులతో పార్టీ అధినేత సమావేశమయ్యారు.

## ఏసీబీకి చిక్కిన వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్



హైదరాబాద్: వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం పరిధిలోని తుర్కయాంజల్‌కు చెందిన ఓ వ్యక్తికి 200 గజాల స్థలం ఉంది. ఆ స్థలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ రాజేశ్‌ను సంప్రదించారు. ప్లాటు రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేయగా.. రూ. 70వేలకు బేరం కుదిరింది. దీనిపై ప్లాటు యజమాని ఏసీబీ అధికారులకు సమాచారం అందించాడు. శుక్రవారం రూ.70వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ రమేశ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడిని విచారించగా సబ్‌రిజిస్ట్రార్ సూచన మేరకే డబ్బులు తీసుకున్నట్లు తెలిపాడు. ఏసీబీ అధికారులు సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్‌తో పాటు రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# కేక్ కట్ చేయాల్సిన బాలుడు తలకొరివి పెట్టడం కలచివేసింది

**: జస్టిస్ నగేశ్ భీమపాక**

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో లైసెన్స్ తీసుకున్న కేబుళ్లు తప్ప ఏవీ ఉంచవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి కేబుల్ వైరు తగిలి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో భారతి ఎయిర్‌టెల్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక మరోసారి విచారణ జరిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటంపై న్యాయమూర్తి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రామంతాపూర్ ఘటనను ఆయన ప్రస్తావించారు. బర్త్‌డే రోజే తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడి ఘటనపై ఉద్వేగభరితంగా మాట్లాడారు. కేక్ కట్ చేయాల్సిన 9 ఏళ్ల బాలుడు తలకొరివి పెట్టడం కలచివేసిందని జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారే చేతులు దులిపేసుకుంటే ఎలా?అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



‘‘ప్రజల ప్రాణాలకు బాధ్యులెవరు?పసిహృదయం పగిలిపోయింది.. దీనికి అందరం బాధ్యులమే. సమాజం సిగ్గుతో తలదించుకోవాలి. చలన రహిత చట్టాలతో ప్రజల ప్రాణాలను ఎలా కాపాడగలం?’’అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. వైర్ల బరువుతో స్తంభాలు ఒరిగిపోతున్నాయన్న పిటిషనర్ల వాదనపై జస్టిస్ నగేశ్ భీమపాక ఆగ్రహం వ్యక్తం చేశారు. మామూళ్లతో కొందరు ఉద్యోగుల జేబులు బరువెక్కుతున్నాయన్నారు. ఒకరినొకరు నిందించుకోవద్దని.. ఇలాంటివి పునరావృతం కానివ్వొద్దని సూచించారు. స్తంభాలపై అన్ని వైర్లు నలుపు రంగులో ఉన్నందున గుర్తుపట్టలేకపోయామని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొనగా.. కరెన్సీ నోట్లపై ఉన్న గాంధీని మాత్రం బాగానే గుర్తుపడతారని న్యాయమూర్తి చురకలంటించారు.

# కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణ వాయిదా

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ ఇచ్చిన నివేదికపై మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ నివేదికను రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై శుక్రవారం ఉన్నత న్యాయస్థానం మరోసారి విచారణ చేపట్టింది. కమిషన్ నివేదికపై ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోర్టుకు అందించారు.



అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నివేదికపై ముందుకు వెళ్తామని సీజే ధర్మాసనానికి తెలిపారు. కమిషన్ నివేదికను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నివేదిక వెబ్‌సైట్‌లో ఉంటే వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కౌంటర్ దాఖలుకు ప్రభుత్వం, కమిషన్‌కు 3 వారాలు, ప్రతివాదుల కౌంటర్‌పై జవాబివ్వడానికి పిటిషనర్లకు వారం గడువు ఇచ్చింది. అసెంబ్లీలో చర్చించిన తర్వాత కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలుంటాయని ఏజీ చెప్పిన నేపథ్యంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. అనంతరం విచారణను 5 వారాలకు వాయిదా వేసింది.

## భారీ నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**అమెరికా ఫెడ్ ఛైర్మన్ ప్రసంగంపై ఇన్వెస్టర్లలో ఆందోళన**

**సెన్సెక్స్ 693 పాయింట్లు, నిఫ్టీ 213 పాయింట్లు పతనం**

**డాలర్‌తో పోలిస్తే 25 పైసలు బలహీనపడిన రూపాయి**

**బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి**



**ముంబై:** ఆరు రోజుల పాటు లాభాల్లో పరుగులు పెట్టిన దేశీయ స్టాక్ మార్కెట్లకు శుక్రవారం బ్రేక్ పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ ప్రసంగానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించడంతో సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి వెల్లువెత్తింది. దీంతో గత మూడు రోజులుగా ఆర్జించిన లాభాలను మార్కెట్లు ఒక్కరోజే కోల్పోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 693.86 పాయింట్లు నష్టపోయి 81,306.85 వద్ద స్థిరపడింది. ఉదయం 81,951.48 వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్, రోజంతా అమ్మకాల ఒత్తిడితో 81,291.77 వద్ద ఇంట్రా-డే కనిష్ఠాన్ని తాకింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 213.65 పాయింట్లు దిగజారి 24,870.10 వద్ద ముగిసింది. దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ బ్యాంక్ 1.09 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.96 శాతం, ఎఫ్ఎంసీజీ 1 శాతం, ఐటీ 0.79 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ లో ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి ప్రధాన షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా బలహీనపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో రూపాయి విలువ 25 పైసలు క్షీణించి 87.50 వద్ద ముగిసింది. రష్యాకు వ్యతిరేకంగా భారత్‌పై అమెరికా వాణిజ్య సుంకాలను వ్యూహాత్మకంగా ప్రయోగిస్తుండడం వంటి ఆందోళనలు కూడా సంస్థాగత ఇన్వెస్టర్లను ప్రభావితం చేసినట్టు తెలుస్తోంది. ముడిచమురు ధరలు, ప్రపంచ పరిణామాలు కూడా సమీప భవిష్యత్తులో మార్కెట్లను నిర్దేశించే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## త్వరలో భారత్‌లో ఓపెన్ ఏఐ తొలి ఆఫీస్..

**ఉద్యోగ నియామకాలు చేపట్టిన సంస్థ..!**




**న్యూఢిల్లీ:** చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్‌ఏఐ భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరించడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే ఇటీవలే 'చాట్‌జీపీటీ గో' పేరుతో సరికొత్త, చవకైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం రూ.399కే ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. భారత్‌లో ఓపెన్ ఏఐ టూల్స్‌కు మంచి డిమాండ్ దృష్ట్యా భారత వినియోగదారులకు చవకైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను తెచ్చింది. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో తన తొలి ఆఫీస్‌ను ఓపెన్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

ఈ ఏడాది చివరికల్లా దేశరాజధాని న్యూ ఢిల్లీలో కార్యాలయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో చాట్ జీపీటీ వినియోగం గణనీయంగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే ఉద్యోగ నియామకాలు కూడా చేపట్టినట్లు తెలిపాయి. ఈ మేరకు కంపెనీ వర్గాలను ఊటంకిస్తూ ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. మరోవైపు భారత్‌లో ఏఐకి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మాన్ అన్నారు. భారత్‌లో తొలి ఆఫీస్‌ను ప్రారంభించి స్థానిక టీమ్‌ను ఏర్పాటు చేయడం, ఆ మిషన్‌కు కట్టుబడి భారత్‌లో కృత్రిమ మేధను మరింత అందుబాటులోకి తెస్తామన్న నిబద్ధతకు ఇది తొలి మొట్టు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

## ఫాక్స్‌కాన్‌లో మళ్లీ అదే సీన్..

**భారత్ నుంచి వందలాది చైనా ఇంజినీర్లు వెనక్కి!**

**భారత్ నుంచి మరో 300 మంది చైనా ఇంజినీర్ల వెనక్కి**

**ఫాక్స్‌కాన్ అనుబంధ సంస్థ యుజాన్ టెక్నాలజీ నిర్ణయం**

**నెలల వ్యవధిలో ఇలా జరగడం ఇది రెండోసారి**

**ఐఫోన్ 17 సిరీస్ పనులు సమీపిస్తున్న వేళ కీలక పరిణామం**

**భవిష్యత్తులో తైవాన్ నుంచి ఇంజనీర్లను తెచ్చేందుకు కంపెనీ సన్నాహాలు**




**న్యూఢిల్లీ:** యాపిల్ ఐఫోన్ల కాంట్రాక్ట్ తయారీదారు ఫాక్స్‌కాన్ అనుబంధ సంస్థ యుజాన్ టెక్నాలజీ భారత్‌లో పనిచేస్తున్న 300 మంది చైనా ఇంజినీర్లను వెనక్కి పిలిపించింది. కొద్ది నెలల వ్యవధిలో ఈ తరహా పరిణామం చోటుచేసుకోవడం ఇది రెండోసారి.

యాపిల్ ఐఫోన్ 17 సిరీస్ తయారీ పనులు సమీపిస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో జులై 2న కూడా ఫాక్స్‌కాన్ దాదాపు ఇంతే సంఖ్యలో చైనా ఇంజినీర్లను వారి స్వదేశానికి పంపిన విషయం తెలిసిందే. తాజాగా మరో 300 మందిని వెనక్కి పిలవడంతో పాటు, భారత్‌కు కొత్తగా రావాల్సి ఉన్న మరో 60 మంది ఇంజినీర్ల ప్రయాణాన్ని కూడా రద్దు చేసినట్లు 'ఎకనామిక్ టైమ్స్' నివేదించింది. ఈ విషయాన్ని కంపెనీ ఇప్పటికే భారత ప్రభుత్వానికి తెలియజేసినట్లు సమాచారం.

ఒకవైపు భారత్-చైనా మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయని వార్తలు వస్తున్న సమయంలో ఫాక్స్‌కాన్ ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యంగ్ లియు, భారత్‌లో పెట్టుబడులు, కార్యకలాపాలపై ఒక నివేదిక సమర్పించాలని కోరినట్లు కూడా తెలుస్తోంది.

అయితే, చైనా ఇంజినీర్లను వెనక్కి పంపడం వల్ల భారత్‌లోని స్థానిక కార్యకలాపాలపై తక్షణ ప్రభావం ఏమీ ఉండబోదని కంపెనీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా, చైనాపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు కంపెనీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా తైవాన్ వంటి ఇతర దేశాల నుంచి నిపుణులైన ఇంజినీర్లను భారత్‌కు రప్పించేందుకు స్థానిక యూనిట్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# సూపర్ ఫిట్‌గా కోహ్లీ, రోహిత్..

**వరల్డ్ కప్‌లో ఆడడం ఖాయం..!**

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ ద్వయంగా పేరొందిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మళ్లీ బ్లూ జెర్సీతో మైదానంలోకి దిగితే చూడాలనుకుంటున్నారు అభిమానులు. టీ20, టెస్టులు.. ఈ రెండు ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ వన్డేల్లో చెలరేగేందుకు సిద్ధమవుతున్నారు. అయినా సరే ఈ ఇద్దరికీ వచ్చే వన్డే వరల్డ్ కప్‌లో చోటు దక్కడంపై సందేహాలు వెలిబుచ్చుతున్నారు కొందరు. కుర్రాళ్లు దూసుకొస్తున్న నేపథ్యంలో మెగా టోర్నీలో 'రోకో'కు ఛాన్స్ కష్టమే అని మాజీలు సైతం అభిప్రాయ పడుతున్నారు.





కానీ.. అనుభవజ్ఞులైన కోహ్లీ, హిట్‌మ్యాన్ వరల్డ్ కప్‌లో ఆడితే టీమిండియాకు తిరుగుండదని అంటున్నాడు రాస్ టేలర్. 'కోహ్లీ, రోహిత్‌లను చూడండి.. ఇప్పటికీ చాలా ఫిట్‌గా ఉన్నారు. వయసు పైబడుతున్నా తమ బ్యాట్ పవర్ చూపిస్తూ పరుగులు సాధిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఎన్నో రికార్డుల బద్ధలు కొట్టిన ఈ ఇద్దరు ఇంకా ఏం కోరుకుంటున్నారో వాళ్లకు మాత్రమే తెలుసు. ఇద్దరూ తండ్రులయ్యారు. క్రికెట్ కోసం కుటుంబం, పిల్లలకు చాలారోజులు దూరంగా ఉంటున్నారు. ఆటపట్ల వాళ్లకున్న చిత్తశుద్ధి ప్రపంచానికి తెలుసు. భారత క్రికెట్‌కు కూడా విరాట్, రోహిత్ చాల సేవ చేశారు. అందుకే ఈ దిగ్గజ ఆటగాళ్లు 2027 వన్డే వరల్డ్ కప్ స్క్వాడ్‌లో ఉండాలని కోరుకుంటున్నా' అని న్యూజిలాండ్ వెటరన్ వెల్లడించాడు.

### ఏడాది వరకూ ఫిట్‌గా ఉంటారా?

నిరుడు పొట్టి వరల్డ్ కప్, ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకమైన రోహిత్, కోహ్లీలు సంయుక్తంగా వన్డే వరల్డ్ కప్ మాత్రం గెలవలేదు. 2011లో వన్డే వరల్డ్ కప్ గెలుపొందిన జట్టులో కోహ్లీ సభ్యుడు కాగా.. రోహిత్ మాత్రం మిస్ అయ్యాడు. రెండేళ్ల క్రితం అతడి సారథ్యంలో భారత్ ఫైనల్ చేరినా ట్రోఫీని అందుకోలేకపోయింది. ఆస్ట్రేలియా బౌలర్ల విజృంభణతో ఆదిలో తడబడిన రోహిత్ సేన భారీ స్కోర్ చేసినా.. ట్రావిస్ హెడ్ మెరుపు సెంచరీతో ఆసీస్ ఆరోసారి విశ్వ విజేతగా నిలిచింది.

## పదకొండు మంది ఆర్సీబీ వారసత్వంలో భాగం..

**వాళ్ల కుటుంబాలను గౌరవిస్తాం!**

**బెంగళూరు:** తొక్కిసలాట.. ఆపై పోలీసు కేసుతో చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లకు బ్రేక్ పడింది. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికే మహారాజా టీ20 లీగ్ ఆతిథ్యాన్ని కోల్పోయిన చిన్నస్వామి మైదానం నుంచి మహిళల వరల్డ్ కప్ మ్యాచ్‌లు తరలిపోయాయి. ఓవైపు చిన్నస్వామి స్టేడియం ప్రతిష్ఠ దిగజారుతుండగా.. మరోవైపు ఆర్సీబీకి చెడ్డ పేరు వస్తున్న ఈ సమయంలో ఆర్సీబీ డైరెక్టర్ మో బొబత్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.

తొక్కిసలాటలో మృతి చెందిన వాళ్లను తమ వారసత్వంగా పరిగణిస్తామని.. వాళ్లను, వాళ్ల కుటుంబాన్ని ప్రత్యేకంగా గౌరవిస్తామని తెలిపాడు బొబత్. తొక్కిసలాటలో మరణించిన పదకొండుమందికి ప్రత్యేక గౌరవం కల్పించాలని శుక్రవారం ఆర్సీబీ యాజమాన్యాన్ని కోరాడు. తమ జట్టు విజయంతో కోసం నిరీక్షించి.. తీరా విక్టరీ పరేడ్‌లో పాల్గొనేందుకు వచ్చి మృత్యుఒడికి చేరిన వారిని తమలో ఒకరికి గుర్తిస్తున్నట్టు చెప్పాడు బొబత్.

'క్రికెట్, ఐపీఎల్ మ్యాచ్‌లు ఎంతో థ్రిల్ పంచుతాయి. మమ్మల్ని ఎల్లప్పుడూ ప్రోత్సహించే అభిమానులు మాకు అతిపెద్ద ఆస్తి. బెంగళూరు ఫ్రాంచైజీ ఐపీఎల్ కప్ గెలుపొందాలని వీళ్లందరూ 18 ఏళ్లుగా ఎదురుచూశారు. వాళ్లందరి కోసం మా జట్టు ట్రోఫీ సాధించింది. కానీ, దురదృష్టవశాత్తూ.. తొక్కిసలాటలో 11 మంది మరణించడం బాధాకరం. ఆ పదకొండు




మందిని.. వాళ్ల కుటుంబాలను మేము గుర్తిస్తాం. ఆర్సీబీకి వీరాభిమానులైన వారి జీవితాన్ని మా ఫ్రాంచైజీ చరిత్రలో భాగం చేస్తాం. ప్రతి జట్టుకు ఒక స్టోరీ.. వారసత్వం ఉంటుంది. అలానే మాకూ ఈ అభిమానులతో ముడిపడిన స్టోరీ ఉంది. అందుకే వీళ్లను గౌరవించాలనుకుంటున్నాం' అని బొబాత్ తెలిపాడు.

ఐపీఎల్‌లో అశేష అభిమానగణం కలిగిన జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. పద్దెనిమిదో సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచిన బెంగళూరు ఫ్రాంచైజీ కోట్లాదిమంది కలల్ని నిజం చేస్తూ కప్‌ను అందుకుంది. కానీ, ఆ సంతోషాన్ని చిన్నస్వామి తొక్కిసలాట అందరి ముఖాల నుంచి మాయం చేసింది. భారత క్రీడా చరిత్రలో రెండో అతిపెద్ద ప్రమాదం పదకొండు మందిని బలిగొంది. అప్పటి నుంచి ఈ మైదానంలో క్రికెట్ ఆటకు ఫుల్‌స్టాప్ పడింది. జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో మరణించిన 11 మంది కుటుంబాలకు ఆర్సీబీ యాజమాన్యం రూ.10 లక్షలు నష్టపరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే.

## జట్టులో చోటు లేదు.. బెంచ్ మీద ఉండలేకనే వీడ్కోలు పలికాను..!

**న్యూఢిల్లీ:** భారత మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ వీడ్కోలు పలికి నెలలు కావొస్తోంది. కీలకమైన ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలో అతడు ఉన్నపళంగా రిటైర్మెంట్ వార్తతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. టీమిండియా స్పిన్ యూనిట్‌కు పెద్దన్నలా వ్యవహరించే అశ్విన్.. అంత తొందరగా నిర్ణయం తీసుకోవడానికి దారితీసిన పరిస్థితులు అంతుచిక్కలేదు. ప్రస్తుతం ఫ్రాంచైజీ క్రికెట్ మాత్రమే ఆడుతున్న యశ్ తాజాగా తన వీడ్కోలుపై మౌనం వీడాడు.

కొన్ని కారణాల వల్లనే తాను అర్ధాంతరంగా ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే తన అంతర్జాతీయ కెరీర్‌ను ముగించాల్సి వచ్చిందని యశ్ తెలిపాడు. యూట్యూబ్ సిరీస్ కుట్టి స్టోరీస్‌లో వీడ్కోలు పలకడానికి కారణం ఏంటీ? అని రాహుల్ ద్రవిడ్ అడిగిన ప్రశ్నకు ఈ వెటరన్ క్రికెటర్ ఆసక్తికర సమాధానం చెప్పాడు.

నిరుడు 2024 డిసెంబర్‌లో హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించాడు అశ్విన్. సిరీస్ మధ్యలోనే దిగ్గజ స్పిన్నర్ అలా వైదొలగడం పలు సందేహాలకు తావిచ్చింది. కొన్ని నెలలుగా మౌనంగా ఉన్న అతడు ఎట్టకేలకు ఓపెన్ అయ్యాడు. 'బోర్డర్ %-% గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టు ముగిసిన తర్వాత వీడ్కోలు బాంబ్ పేల్చాడు. సమయం రాగానే వీడ్కోలు పలకాలని అనుకున్నా. నేను జీవితంలో ఏ దశలో ఉన్నాను? అని ఆలోచించాను. నాకు వయసైపోతుందని గ్రహించాను. స్క్వాడ్‌తో పాటు విదేశీ




పర్యటనలకు వెళ్లడం వరకూ బాగానే ఉంటుంది. కానీ, పదకొండు మందిలో లేకుండా ఎక్కువ రోజులు బెంచ్‌మీద కూర్చోవడం ఎంతో బాధిస్తుంది. నాకూ అదే పరిస్థితి ఎదురైంది. సో.. ఇక నా కెరీర్ ముగించేందుకు సమయం వచ్చిందని అర్థమైంది. అందుకే.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలోనే ప్రకటన చేశాను' అని అశ్విన్ పేర్కొన్నాడు. అంతేకాదు కుటుంబంతో గడపాలనే ఆలోచన కూడా వీడ్కోలు నిర్ణయానికి ఒక కారణమని ఈ స్పిన్ దిగ్గజం అన్నాడు. 'దేశానికి ఆడకూడదనే ఆలోచన ఎప్పుడూ నాకు రాలేదు. కానీ, అదే సమయంలో కుటుంబానికి సమయం కేటాయించడం, పిల్లలతో గడపడం చాలా ముఖ్యమని భావించాను. నా ఇద్దరు కూతుళ్లు పెద్దవాళ్లు అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంకా కెరీర్‌ను పొడిగించడం కంటే వీడ్కోలు చెప్పడమే మంచిదని అనిపించింది.

## కుమార్తె సారా 'పైలేట్స్ అకాడమీ' ప్రారంభించడంపై సచిన్ టెండూల్కర్ స్పందన




**ముంబయి:** క్రికెట్ దేవుడు, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఒక తండ్రిగా గర్వంతో ఉప్పొంగిపోతున్నాడు. తన కుమార్తె సారా టెండూల్కర్ తాజాగా ఒక కొత్త వ్యాపారంలోకి అడుగుపెట్టడమే ఇందుకు కారణం. సారా ముంబైలో సొంతంగా ఒక పైలేట్స్ స్టూడియోను ప్రారంభించారు. దీని పేరు పైలేట్స్ అకాడమీ. ఈ సందర్భంగా తన కుమార్తెను అభినందిస్తూ సచిన్ సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్ పంచుకున్నాడు.

"పిల్లలు తమకు అత్యంత ఇష్టమైన పనిని కనుగొన్నప్పుడు తల్లిదండ్రులకు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిది. సారా ఒక పైలేట్స్ స్టూడియో ఓపెన్ చేయడం చూసి మా హృదయాలు సంతోషంతో నిండిపోయాయి" అని సచిన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. సారా తన సొంత కష్టం, నమ్మకంతో అంచెలంచెలుగా ఈ ప్రస్థానానికి బాటలు వేసుకుందని ఆయన ప్రశంసించారు.

తమ కుటుంబంలో ఆరోగ్యం, వ్యాయామానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని సచిన్ గుర్తుచేశారు. ఇప్పుడు అదే ఆలోచనను సారా తనదైన శైలిలో ముందుకు తీసుకెళ్లడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోందని తెలిపారు. "సారా, నిన్ను చూసి మేం ఎంతో గర్వపడుతున్నాం. నువ్వు ప్రారంభించబోతున్న ఈ కొత్త ప్రయాణానికి మా శుభాకాంక్షలు" అంటూ ఆయన తన కూతురిని మనసారా ఆశీర్వదించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు ప్రముఖులు, అభిమానులు సారాకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



# చిల్ బేబీ చిల్..

## మాల్దీవ్స్‌లో నేహాశెట్టి లుక్స్ అదుర్స్!



టాకీస్: అందాల ముద్దుగుమ్మ నేహా శెట్టి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. డీజే టిల్లు సినిమాలో సిద్దు జొన్నలగడ్డ సరసన, రాధిక పాత్రలో నటించి మంచి ఫేమ్ సంపాదించుకుంది.డీజే టిల్లు మూవీతో ఈ బ్యూటీ ఓవర్ నైట్ స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. దీంతో ఈ మూవీ తర్వాత ఈ అమ్మడుకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయనే చెప్పాలి. చాలా సినిమాల్లో ఛాన్స్ లు కొట్టేసింది ఈ చిన్నది. మెహబూబా సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ తర్వాత డీజే టిల్లు మూవీతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. దీంతో ఈ బ్యూటీకి వరసగా ఆఫర్స్ రావడంతో గల్లీ రౌడీ, బెదురులంక, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, టిల్లూ స్క్వేర్ లో ఓ పాత్రలో మెరిసింది. అయితే ఈ అమ్మడు చాలా ఆఫర్స్ వచ్చినప్పటికీ సినిమాలు అంతగా హిట్ అవ్వలేదు. దీంతో ఈ అమ్మడు అంతగా ఫేమ్ సంపాదించు కోలేకపోయింది. ప్రస్తుతం ఈచిన్నదానికి అవకాశాలు తగ్గినట్లు తెలుస్తోంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే నేహా శెట్టి ఎప్పుడూ తన అంద చందాలతో కుర్రకారును ఫిదా చేస్తుంది. తాజాగా ఈబ్యూటీ మాల్దీవ్స్‌లో ఎంజాయ్ చేస్తున్న ఫొటోస్‌ను తన అభిమానులతో పంచుకుంది. అందులో ఈ బ్యూటీని చూస్తే మతిపోవాల్సిందే. బ్లూకలర్ డ్రెస్‌లో, అదిరిపోయే లుక్‌లో ఫొటోలకు ఫోజులిచ్చింది. చల్లటి గాలిని ఆస్వాదిస్తూ.. సముద్రంలో చిల్ అవుతుంది. దీనికి సంబంధించిన ఫొటోస్ ఈ బ్యూటీ షేర్ చేస్తూ.. మాల్దీవ్స్ ఒక కలలా ఉంది. నా కోసమే తయారు చేసినట్లు ఉంది ఈ హాలీడే ట్రిప్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది.

# గోవాలో చిరు బర్త్‌డే వేడుకలు

### కేక్ కట్‌చేసి తినిపించిన చెర్రీ

### మీరెప్పటికీ మా హీరో అంటూ వీడియో షేర్



టాకీస్: మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ఆయన తన కుటుంబంతో కలిసి గోవాలో వేడుకలు జరుపుకున్నారు. బర్త్‌డే వేడుకలు ఎంతో ఘనంగా, సంతోషంగా జరుగుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా చిరుకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిరు తనయుడు మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేశాడు. వీడియోలో చరణ్ తండ్రికి కేక్ తినిపిస్తూ, చిరు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు. చిరంజీవి కూడా చరణ్‌కు కేక్ తినిపిస్తూ కుమారుడిపై తనకున్న ప్రేమని తెలియజేశారు. అయితే రామ్ చరణ్ తన తండ్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెట్టిన పోస్ట్ అందరిని టచ్ చేసింది. 'ఇది కేవలం మీ పుట్టినరోజు మాత్రమే కాదు నాన్న... ఇది మీ లాంటి గొప్ప వ్యక్తికి జరుపుతున్న గొప్ప సంబరమూ! నా హీరో, నా గైడ్, నా ప్రేరణ మీరు. నా ప్రతి విజయం, నేను మోసే విలువలు అన్నీ మీ నుంచే వచ్చాయి. 70 ఏళ్ల వయసులో కూడా మీరు మా హృదయంలో యువకుడిగా ఉండి, మాకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మీరు ఆనందంగా, ఆరోగ్యంగా మరెన్నో సంవత్సరాలు ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఎవరైనా కోరుకునే ఉత్తమ తండ్రిగా ఉన్నందుకు ధన్యవాదాలు నాన్న అంటూ రామ్ చరణ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది.

# సరదాగా సాగిన... పరదా మూవీ

టాకీస్: చాలా రోజుల తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన మరో నాయికా ప్రధానమైన చిత్రం 'పరదా' . కమర్షియల్ సినిమాల్లో సగటు- హీరోయిన్‌గా, పక్కింటి అమ్మాయిగానే కనిపించిన అనుపమ పరమేశ్వరన్ ఇందులో ప్రధాన పాత్రధారి. యువ దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

పడతి అనే ఓ కల్పితమైన ఊరు నేపథ్యంలో సాగే కథ ఇది. అక్కడ ప్రతి యువతీ పరదా కప్పకొనే తిరగాలనేది ఆచారం. పరదా తీసినట్టు- రుజువైతే మాత్రం గ్రామ దేవత జ్వాలమ్మ ముందు ఆత్మార్పణ చేసుకోవాల్సి ఉంటుంది. అనాదిగా వస్తున్న ఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న ఊరి యువతి సుబ్బు (అనుపమ పరమేశ్వరన్) ఊహించని రీతిలో చిక్కుల్లో పడుతుంది. పరదా లేని ఆమె ఫొటో బయటకి రావడమే అందుకు కారణం. తాను ఆచారాన్ని తప్పలేదని వేడుకున్నా... ఆత్మార్పణ చేసుకోవాల్సిందే అని ఊరి ప్రజలు తీర్మానం చేస్తారు. ఒక పక్క తాను మనసిచ్చిన రాజేశ్ (రాగ్ మయూర్)తో నిశ్చితార్థానికి సిద్ధం అవుతుండగానే ఇదంతా జరుగుతుంది. ఆచారం ప్రకారం ప్రాణాలైనా వదలాలి, లేదంటే తప్ప చేయలేదనైనా నిరూపించుకోవాలని కోరతారు ఊరి ప్రజలు. దాంతో సుబ్బు తాను తప్ప చేయలేదని నిరూపించుకోవడం కోసం ధర్మశాలకి పయనం కావాల్సి వస్తుంది. ఆ ప్రయాణం ఎలా సాగింది? తనకి తోడుగా నిలిచిన రత్న (సంగీ), అమిష్ట (దర్శన రాజేంద్రన్) ఎవరు? ఇంతకీ పరదా లేని సుబ్బు ఫొటో ఎలా బయటికొచ్చింది? పడతి అనే ఊరు అనుసరిస్తున్న కఠినమైన ఆ కట్టుబాటు- వెనక చరిత్ర ఏమిటి?సుబ్బు తాను తప్ప చేయలేదని నిరూపించుకుందా లేదా అన్నకథలో సాగిందీ సినిమా. అప్పడప్పడూ కొత్త కథలు అరుదుగా వస్తుంటాయి. చాలా రోజుల తర్వాత తెలుగు తెరపైకి వచ్చిన ఓ కొత్త కథ... 'పరదా'. హీరో, హీరోయిన్, కమర్షియాలిటీ-... తరహా లెక్కల్ని పట్టించుకోకుండా చేసిన ఓ సాహసోపేతమైన ప్రయత్నం. ముగ్గురు మహిళల స్నేహాల్ని, ఒకరి సమస్య కోసం ముగ్గురూ కలిసి చేసిన స్వేచ్ఛా విహారాన్ని అందంగా, ఆలోచన రేకెత్తించేలా ఆవిష్కరిస్తుంది. దైనందిన జీవితాల నుంచి బయటికొచ్చి చేసిన ఆ ప్రయాణం వాళ్లకు ఏం నేర్పింది?వాళ్లలో ఎలాంటి మార్పుని తీసుకొచ్చింది? సమాజం ముందు ఎలాంటి ప్రశ్నల్ని లేవనెత్తిందన్నది ఇందులో కీలకం. లింగ సమానత్వం అంశాన్ని ఓ కొత్త కోణంలో ఆవిష్కరించిదీ చిత్రం. సమానత్వం అంశం ఎప్పుడు ప్రస్తావనకి వచ్చినా అవతలి వాళ్లవైపు వేళ్లు వెళుతుంటాయి. కానీ, ఈ సినిమా అందుకు భిన్నమైన విషయాల్నీ ప్రస్తావించింది. మనుషుల్లో మార్పుని, ఆ అవసరాన్ని సూచిస్తుంది. అయితే, చెబుతున్న కథ కొత్తదైనా... పాతదైనా తెరపై ఎంత ఆసక్తికరంగా సాగిందన్నదే కీలకం. సన్నివేశాలన్నీ ఒక విహారయాత్ర డాక్యుమెంటేషన్‌లా అనిపిస్తుంది తప్ప, కథ కథనాలు ఏమాత్రం ఆసక్తిని రేకెత్తించవు. ముగింపుతోపాటు- పతాక సన్నివేశాలు ఆకట్టు-కుంటాయి. సుబ్బు పాత్రలో ఒదిగిపోయింది అనుపమ పరమేశ్వరన్. ప్రతి సినిమాలోనూ తన కళ్లతోనే భావాలు పలికించే ఆమె ఈ సినిమాలో ఎక్కువభాగం సన్నివేశాల్లో పరదా కప్పకొనే కనిపిస్తూ ఉంటుంది.



# బాలయ్య ఎనర్జీకి ఫిదా అవ్వాల్సిందే

### అఖండ-2 విలన్ ఆది పినిశెట్టి

**టాకీస్:** నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. తాజాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా






మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ గారు ఒక వ్యక్తి కాదు... ఓ శక్తి. ఆయన ఒరిజినల్ గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్య-బోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, బాలయ్య గారి పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉంటుంది. బాలయ్య- బోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడించారు ఆది. తనకు విలన్ పాత్రల్లో నటించడంపై ఉన్న ఆసక్తిని వెల్లడించిన ఆది, విలన్ క్యారెక్టర్లకు ఎలాంటి పరిమితులు ఉండవు. అవి నటనకు విశేషమైన అవకాశాలు కలిగిస్తాయి. మంచివాడు కాదు, చెడ్డవాడు కాదు, మిడిల్‌లో ఉండే పాత్రలే ఎక్కువ బలాన్నిస్తాయి. అందుకే విలన్ పాత్రలు నాకు ఎక్కువ ఇష్టంగా ఉంటాయి అని అన్నారు. ఇక అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మొదట భావించగా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రగ్యా జైస్వాల్, సంయుక్త మీనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు.

# మన శంకర వరప్రసాద్ టైటిల్ ఖరారు

### వెంకటేశ్ వాయిస్‌తో విడుదల

**టాకీస్:** మెగా157 మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు 2025 పుట్టినరోజు మరపురాని వేడుకగా మారబోతోంది. ఫ్యాన్స్ ఆశించినట్లుగానే క్రేజీ అప్‌డేట్స్ వరుసబెట్టి వచ్చేస్తున్నాయి. మెగా అభిమానులు మాత్రమే కాదు, సినీ ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిరంజీవి - అనిల్ రావిపూడి సినిమా -టైటిల్, గ్లింప్స్ ఎట్టకేలకి విడుదలైంది.చిరంజీవి -అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా -టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. 'మన శంకర వరప్రసాద్ గారు అనే -టైటిల్ కొద్ది రోజులుగా ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతుండగా, అదే -టైటిల్‌ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ -టైటిల్‌ను విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్‌తో అందించడం స్పెషల్ హైలైట్. చిరంజీవి, వెంకటేష్ మధ్య మంచి స్నేహబంధం ఉండటంతో, ఈ ప్రాజెక్ట్‌లో వెంకీ కీలక పాత్రలో కనిపించనున్నారు. గ్లింప్స్ లో చిరంజీవి సూట్ ధరించి సిగరెట్ తాగుకుంటూ అలా వస్తుండడం చూసి ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు. చివరిలో గుర్రం పట్టుకొని నడుచుకుంటూ వచ్చే షాట్ కూడా అదిరిపోయింది. ఇక మన శంకర వర ప్రసాద్ గారు పండక్కి వస్తున్నారు అంటూ వెంకీ చెప్పడం మరో హైలైట్ అయింది. ఈ సినిమా 2026 సంక్రాంతికి థియేటర్లలోకి రాబోతోంది. గతంలో అనిల్ - వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 వంటి హిట్ కామెడీ ఎంటర్-టైనర్లు సంక్రాంతికి రిలీజై ఘన విజయం సాధించిన నేపథ్యం చూస్తే, ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ కావొచ్చన్న అంచనాలు బలపడుతున్నాయి. చిరంజీవి నటిస్తున్న ఫ్యాంటసీ డ్రామా 'విశ్వంభర' నుంచి గ్లింప్స్ ఇప్పటికే రిలీజ్ కాగా, ఇది అలరించింది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.